

# మనం



## అనంతపురం / శ్రీ సత్యసాయి జిల్లా

ఆదివారం - 20 - సెప్టెంబర్ - 2026 : పేజీలు 12


## ఏపీ రాష్ట్ర కాంగ్రెస్ హై లెవెల్ కమిటీ పిఎసి స్థానిక సంస్థల ఎన్నికల కో ఆర్డినేషన్ కమిటీ సమావేశం



### హాజరైన కాంగ్రెస్ వర్కింగ్ కమిటి సభ్యులు రఘువీరా రెడ్డి

**మడకశిర, సెప్టెంబర్ 19,మనంన్యూస్:** విజయవాడలోని ఏపీ రాష్ట్రకాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన హై లెవెల్ కమిటి పిఎసి, స్థానిక సంస్థల ఎన్నికల కో ఆర్డినేషన్ కమిటి సమావేశంనకు

మిగతా 2లో

## గుత్తి పట్టణానికి నిరంతర, నాణ్యమైన తాగునీరు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

❍ ఎంపి అంబికా లక్ష్మీనారాయణ ❍ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం



**గుత్తి సెప్టెంబర్ 19 మనంన్యూస్ :** గుత్తి పట్టణంలోని ఆర్అండ్‌బీ ఆవరణంలో ఏసియన్ ఇన్ఫ్రా స్ట్రక్చర్ ఇన్వెస్ట్మెంట్ బ్యాంక్ నిధులతో రూ. 250.93 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న సమగ్ర తాగునీటి సరఫరా అభివృద్ధి పనులకు శనివారం స్థానిక ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంతో కలిసి అనంతపురం పార్లమెంటు సభ్యుడు అంబికా లక్ష్మీనారాయణ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎం.పి. అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ గుత్తి ప్రజల భవిష్యత్ తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించిన ఈ భారీ ప్రాజెక్టు ద్వారా పట్టణంలోని అన్ని ప్రాంతాలకు సమగ్రంగా మంచినీటి సరఫరా అందించేందుకు చర్యలు చేపడుతున్నామని,ఈ ప్రాజెక్టుకు 2018లో రూ. 173.02 కోట్లతో

మిగతా 2లో



# పెనుకొండ అభివృద్ధే లక్ష్యం



- ✦ మున్సిపాలిటీపై కూటమి జెండా ఎగరేయాలి
- ✦ రూ.20 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం
- ✦ అమృత్ పథకంతో రూ.100 కోట్లతో ఇంటింటికి మినరల్ తాగునీటి సౌకర్యం: మంత్రి సవిత
- ✦ అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- ✦ కూటమి శ్రేణులకు మంత్రి సవిత పిలుపు

**పెనుకొండ సెప్టెంబర్ 19 మనంన్యూస్ :** రానున్న మున్సిపల్ ఎన్నికల్లో పెనుకొండ మున్సిపాలిటీని కూటమి పార్టీ కైవసం చేసుకునేలా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖల మంత్రి సవిత పిలుపునిచ్చారు. శనివారం పెనుకొండ క్యాంపు కార్యాలయంలో మున్సిపాలిటీ పరిధిలోని కూటమి నాయకులు, కార్యకర్తలతో మంత్రి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. హిందూపురం పార్లమెంట్ స్థానిక ఎన్నికల ఇన్‌చార్జి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, సత్యసాయి జిల్లా టీడీపీ అధ్యక్షుడు ఎమ్మెస్‌రాజుసమావేశంలోపాల్గొని పార్టీ బలోపేతం, నాయకులు-కార్యకర్తల సమన్వ యం, మున్సిపల్ ఎన్నికల కార్యాచరణపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో పెనుకొండ ప్రజలు కూటమి ప్రభుత్వానికి అత్యధిక మెజారిటీ అందించారని అన్నారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునే విధంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. మున్సిపల్ కౌన్సిల్ ప్రస్తుతం టీడీపీ ఆధీనంలో లేకపోయినప్పటికీ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 26 నెలల్లో పెనుకొండ పట్టణ అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపట్టామని వివరించారు.పెనుకొండ మున్సిపాలిటీలో ఇప్పటికే రూ.20 కోట్లతో వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించామని మంత్రి తెలిపారు. పట్టణ ప్రజలకు

మిగతా 2లో





# ఆరంభ సూరత్వమేనా!?



అనంతపురం నగరపాలక సంస్థ ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన డోర్ టూ డోర్ చెత్త సేకరణ ఈ-ఆటోలు ఆరంభ శూరత్వంగానే మిగిలిపోతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.నగరంలో చెత్త సేకరణ కోసం కొత్తగా తెచ్చిన 15 ఎలక్ట్రిక్ ఆటోలకు సరైన ఛార్జింగ్ సెంటర్ కూడా ఏర్పాటు చేయకుండానే అధికారులు హడావుడిగా పచ్చజెండా ఊపేశారని తెలుస్తోంది. ఛార్జింగ్ సెంటర్ లేకపోతే ఆటోలు ఎలా డోర్ టూ డోర్ తిరుగుతాయన్నది నేడు ప్రశ్నార్థకంగా మారింది. ఇదే విషయంపై శనివారం కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్యే, ఎంపీ సమక్షంలోనే మీడియా నగరపాలక కమిషనర్‌ను ప్రశ్నించగా, “ఛార్జింగ్ సెంటర్ సెంట్రల్ పార్క్ లో ఉంది” అని చెప్పారు.

- ఈ ఆటోల డోర్ టూ డోర్ కదలిక ప్రశ్నార్థకం
- ఛార్జ్ సెంటర్ లేకుండానే పాలక అధికారుల పచ్చజెండా
- మీడియాకు సమాధానం చెప్పలేక తడబడిన కమిషనర్ రావ్
- ముందే పసిగట్టి కార్యక్రమానికి దూరంగా కలెక్టర్

**అనంతపురం, సెప్టెంబర్ 19 మనంన్యూస్:** అయితే సెంట్రల్ పార్క్ లో ఎక్కడ ఉందని మీడియా నిలదీయగా, “ఉందిలే” అంటూ దాటవేత ధోరణి అవలంబించారు .దీంతోఆ ప్రాంతానికి వెళ్లి మీడియా ఆరా తీయగా అసలు గుట్టు బయట పడింది. గతంలో ఓపెన్ జిమ్ కోసం 20 సెంట్లలో ఏర్పాటు చేసిన

మిగతా 2లో



ఈ కనిపిస్తున్న కాంపౌండ్ వాల్లే రీఛార్జ్ పాయింట్... కనీసం కరెంటు సప్లై యే లేదట

## అమరాపురంలో నీలకంఠాపురం శ్రీరామరెడ్డి తాగునీటి పథకం ప్రాజెక్ట్ సంపులు పరిశీలన

➲ అమరాపురం బసవన పల్లి బూది పల్లి మెళవాయి సంపులు సందర్శన ➲ జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్

**అమరాపురం, సెప్టెంబర్ 19, మనంన్యూస్:** అమరాపురం మండలం, హాలుకూరు గ్రామ పొలిమేరలో గతంలో ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిననీలకంఠాపురం శ్రీరామరెడ్డి తాగునీటి పథకం ప్రాజెక్ట్ ద్వారా నిర్మించిన తాగునీటి సంపులను శనివారం శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఎ. శ్యాం ప్రసాద్ సందర్శించిపరిశీలించారు. ఈ సందర్భంగాప్రస్తుతం అతిగతిలేని శ్రీరామరెడ్డి తాగునీటి పథకం ప్రాజెక్ట్ నిర్వాహకం పట్ల అయన సంబంధిత అధికారుల ద్వారా ఆరా తీశారు. సంపు మెకానిక్, సదరు కాంట్రాక్టర్, శ్రీరామరెడ్డి తాగునీటి పథకం, ఆర్ డబ్ల్యూఎస్ అధికారులు, ఇంజనీర్లుతో అయన మాట్లాడుతూ

మిగతా 2లో



## ఏపీ రాష్ట్ర కాంగ్రెస్ హై లెవెల్ కమిటీ పింసి స్థానిక సంస్థల ఎన్నికల కో ఆర్డినేషన్ కమిటీ సమావేశం

మాజీ మంత్రి, కాంగ్రెస్ వర్కింగ్ కమిటి సభ్యులు,రాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికలకోఆర్డినేషన్ కమిటి చైర్మన్ డాక్టర్ ఎన్. రఘువీరారెడ్డి హాజరయ్యారు. ఈ సమావేశం నకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ, ఏపీ కాంగ్రెస్ ఇంచార్జ్ పివిమోహన్‌కురఘువీరారెడ్డి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రులు పళ్ళంరాజు, జేడీ శీలం,సి డబ్ల్యూసిసభ్యుడు కొప్పులరాజు,కాంగ్రెస్ వర్కింగ్ కమిటి ప్రత్యేక ఆహ్వానితులు మాజీ ఎమ్మెల్సీ, గిడుగు రుద్రరాజు, ఏఐసిసి కార్యదర్శి ప్రసాద్, తులసి రెడ్డి, మస్తాన్, కమలమ్మ తదితరులు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



# పెనుకొండ అభివృద్ధే లక్ష్యం

శాశ్వతంగా తాగునీటి సమస్య పరిష్కరించే లక్ష్యంతో అమృత్ పథకం కింద సుమారు రూ.100 కోట్లతో ఇంటింటికీ తాగునీటిని అందించే కార్యక్రమాన్ని చేపడుతున్నామని చెప్పారు. ఆర్టీసీ బస్టాండ్‌ను రూ.3 కోట్ల సిఎస్ఆర్ నిధులతో అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. పట్టణంలో సెంట్రల్ లైటింగ్ పనులు పూర్తి చేశామని, ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు.మైనారిటీల సంక్షేమానికి కూడా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. రూ.8 కోట్లతో మూడు ఎకరాల్లో సద్భావన భవన్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని, రూ.50 లక్షలతో షాదీ మహల్ నిర్మాణానికి నిధులు కేటాయించినట్లు చెప్పారు. కాపు భవన్ నిర్మాణానికి రూ.2 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. రూ.64 లక్షలతో అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేశామని, 1,250 మంది అర్హులకు ఇళ్ల పట్టాలు అందించేందుకు చర్యలు చేపడుతున్నామని వివరించారు.ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని మంత్రి సవిత అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. స్థానిక సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయడంతో పాటు ప్రజలకు అందుబాటులో ఉండాలని అన్నారు.పెనుకొండ అభివృద్ధి బాధ్యత నాది. పార్టీని బలోపేతం చేసి మున్సిపాలిటీని కైవసం చేసుకునే బాధ్యత ప్రతి నాయకుడు, కార్యకర్తపై ఉందని అని మంత్రి సవిత అన్నారు. నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం మరింత పెంచుకుని, రాబోయే ఎన్నికలను సమష్టిగా ఎదుర్కొనేందుకు ఇప్పటి నుంచే కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. సమావేశంలో మున్సిపాలిటీ పరిధిలోని కూటమి నాయకులు, వార్డు స్థాయి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆరంభ సూరత్వమేనా!?

కాంపౌండ్ వాల్ స్థలాన్నే హడావుడిగా ఎలక్ట్రిక్ రీఛార్జ్ పాయింట్ గా ఎంపిక చేసుకున్నట్లు తెలిసింది. కనీసం కరెంట్ కనెక్షన్ కూడా లేకుండా, ముందస్తు ప్రణాళిక లేకుండా కొత్త ఆటోలను ఎమ్మెల్యే, ఎంపీలతో పచ్చజెండా ఊపించడం పట్ల పలువురు విమర్శిస్తున్నారు.ఈ విషయాన్ని కమిషనర్ బాధ్యతగా పాలకులకు తెలియజేయాల్సి ఉండగా, అంతా సక్రమంగా ఉందని వారిని సైతం తప్పుదోవ పట్టించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందుకే విషయాన్ని ముందే పసిగట్టిన కలెక్టర్ ఈ కార్యక్రమానికి దూరంగా ఉన్నారనే చర్చ జరుగుతోంది.ప్రజల ప్రశ్న: కోట్ల రూపాయలు ఖర్చు చేసి ఆటోలు తెచ్చారు, కానీ కనీస మౌలిక వసతులు లేకుండా ఎలా నడుపుతారు? ఇది ప్రజాధనం వృధా కాదా? గతంలో ఇలాగే ఎలక్ట్రిక్ కార్లు తెచ్చి కార్యాలయంలో వృధాగా పడేశారు కదా? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఎలక్ట్రికల్ ఆటోల కదలికపట్ల అడుగడుగునా అనుమానాలే నగరపాలక సంస్థ పరిధిలో ఇప్పటికే దాదాపు 50 ట్రాక్టర్లు 50 ఆటోలు అద్దె ప్రాతిపదికన చెత్త తరలింపుకు తిప్పుతున్నారు. వీటన్నింటినీ కూడా టిడిపి పార్టీకి సంబంధించిన కొందరు కార్యకర్తలు నిర్వహిస్తూ ఉండడం విశేషం. అయితే వాటన్నిటిని ఎప్పుడు రద్దు చేస్తారు, నిజంగా రద్దు చేస్తారా, లేక ఈ ఈవీ ఆటోలనే మూలన పడేసి టిడిపి కార్యకర్తలకు, నాయకులకు న్యాయం చేసేలా అద్దె వాహనాలనే కొనసాగిస్తారా అన్నది తెలియాల్సి ఉంది.



కార్యక్రమానికి పక్కనే మూలన పడిన నగరపాలక ఎలక్ట్రికల్ కార్లు

## గుత్తి పట్టణానికి నిరంతర, నాణ్యమైన తాగునీరు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం



పరిపాలనా అనుమతులు మంజూరయ్యాయి. అయితే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిధుల విడుదలలో జాప్యం కారణంగా 2023 సెప్టెంబర్ నాటికి పనులు నిలిచిపోయాయి. పాత ధరలతో పనులు కొనసాగించడం సాధ్యం కాకపోవడంతో పాత కాంట్రాక్టును రద్దు చేయాల్సి వచ్చిందని ,ప్రజలఅవసరాలను దృష్టిలో ఉంచుకుని 2025లో రూ.250.93 కోట్లతో నూతన పరిపాలనా అనుమతులు మంజూరు చేసి, 2026 మార్చిలో పనులను జిందాల్ వాటర్ ఇన్ఫ్రా లిమిటెడ్ సంస్థకు అప్పగించామని తెలిపాడు. కెపిఎస్ వెన్యూ వద్ద 1050 కేఎల్ జిఎల్ఎస్ఆర్ మరియు జిఎల్బిఆర్, డిఎస్ఎస్ 2 వద్ద 900 కేఎల్ జిఎల్ఎస్ఆర్ ఈద్గా పేటలో 700 కే ఎల్ఈఎల్ఎస్ ఆర్ నిర్మాణ పనులు చేపట్టనున్నారు. పట్టణంలోని ఇప్పటికే ఉన్న పలు వాటర్ ట్యాంకులకు కూడా ఈ పథకం ద్వారా నీటి సరఫరా అందించనున్నారని, పట్టణమంతటా 103 కి.మీ. పొడవైన డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ ఏర్పాటు చేసి 13,470 నూతన గృహ కుళాయి కనెక్షన్లు అందించనున్నామని,రాబోయే 15 నెలల్లో గుత్తి పట్టణంలోని ప్రతి ఇంటికీ మంచి నీటి సరఫరా అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో పనులను వేగంగా పూర్తి చేసేందుకు కృషిచేస్తున్నామన్నారు.ఈకార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, ఇంజనీర్లు, కార్మిక శాఖ చైర్మన్ వెంకట శివుడు , గుత్తి జనసేన నాయకులు వెంకటేశులు, బీజేపీ నాయకులు వెంకటప్ప, జిందాల్ ప్రతినిధి మణి రమణ , స్థానిక నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.







## అమరాపురంలో నీలకంఠాపురం శ్రీరామరెడ్డి తాగునీటి పథకం ప్రాజెక్ట్ సంపులు పరిశీలన




ప్రాజెక్ట్ ఆలనా పాలన పట్ల అయన అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం శ్రీరామరెడ్డి తాగునీటి పథకం ద్వారా నీటిసరఫరాకు డ్యాంనుండి నీటిని విడుదల చేయడం జరిగిందని, ఇక నుండి మెయిన్ పైపు లైన్, సంపులు మోటర్లు రన్నింగ్ తదితర వాటి పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని అయన అధికారులకు పలు సూచనలు, సలహాలునిచ్చారు.ఈ కార్యక్రమంలో శ్రీరామరెడ్డి తాగునీటి పథకం డిఇ శిరీష, ఆర్డబ్ల్యూఎస్ ఇఇ ఎం. మురళీదర్, మడకశిర డిఇ జె. మనూ నాయక్,అమరాపురం తహసీల్దార్ బి. హనుమంతు, ఎంపీడీఓ డి. రామారావు, మడకశిర వ్యవసాయ శాఖ ఎడిఎ కృష్ణమీనన్,పట్టుపరిశ్రమ శాఖ ఎడి హనుమంతనాయక్, గుడిబండ ఎంపీడీఓ డాక్టర్ పి. కేశవరెడ్డి,అమరాపురం మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ విన్సెంట్ పాల్, మండల సర్వేయర్ పుట్టరాజు, డెప్యూటీఎంపీడీఓఎంఎల్ఎన్‌మూర్తి, అమరాపురం, గుడిబండ మండలాలకు చెందిన ఎఓలు మంజునాథ్,వీరనరేష్,గుడిబండ మండలంఆర్ డబ్ల్యూఎస్ జెఇ టి. హరి, అమరా పురం, రొళ్ల ఇంచార్జీ జెఇలు మనోహర్, నరేష్ గౌడ,శ్రీరామరెడ్డి తాగునీటి పథకం కార్మికులు తదితరులు పాల్గొన్నారు.





## ఆంజనేయ స్వామి దర్శనానికి వెళ్తుండగా కారు అదుపుతప్పి ప్రమాదం

- ఒకే కుటుంబం లో నలుగురు సభ్యులకు గాయాలు.. మహిళకు మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలింపు



**గోరంట్ల సెప్టెంబర్ 19 మనంన్యూస్ :** ఆంజనేయ స్వామి దర్శనం కోసం కుటుంబ సభ్యులతో కలిసి కారులో బయలుదేరిన సమయంలో కారు అదుపుతప్పి ప్రమాదానికి గురైన ఘటన గోరంట్ల మండలంలో చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో భార్య, ఇద్దరు చిన్నారులకు గాయాలయ్యాయి. భర్త, పిల్లలకు స్వల్ప గాయాలు కాగా, భార్యకు తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు.గోరంట్ల మండలం కమ్మవారిపల్లి పంచాయతీ పరిధిలోని చొండూరు వాండ్లపల్లి సమీపంలో ఈ ప్రమాదం జరిగినట్లు తెలిసింది. ఓడిసి మండలం గౌరాపురం గ్రామానికి చెందిన సురేష్ ప్రస్తుతం గోరంట్ల పట్టణంలో నివాసముంటూ ఫోటో స్టూడియో నిర్వహించుకుంటున్నారు. శనివారం సురేష్ తన భార్య సుజాత (30), కుమార్తెలు నివేదిత (7), మన్విత (4)తో కలిసి పుట్టపర్తి మండల పరిధిలోని గంగిరెడ్డిపల్లి సమీపంలో ఉన్న గంగిరెడ్డిపల్లి ఆంజనేయ స్వామి దర్శనానికి కారులో వెళ్తుండగా వాహనం అదుపుతప్పి ప్రమాదానికి గురైనట్లు సమాచారం.ప్రమాదంలో సుజాతతో పాటు ఇద్దరు చిన్నారులకు గాయాలయ్యాయి. సురేష్‌కు కూడా స్వల్పగాయాలైనట్లు తెలిసింది. ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హిందూపురంలోని ఆసుపత్రికి తరలించారు. సుజాతకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.పిల్లలు నివేదిత, మన్వితలకు స్వల్ప గాయాలైనట్లు సమాచారం. ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నట్లు తెలిసింది

# జిల్లా కేంద్రంలో సిఐఐ భాగస్వామ్య సదస్సు - 2026 రీజనల్ కాన్ఫరెన్స్ నిర్వహణ



**అనంతపురం, కలెక్టరేట్ సెప్టెంబర్ 19 మనంన్యూస్ :**
అనంతపురం జిల్లా కేంద్రంలోని జేఎన్టీయూలో వచ్చే అక్టోబర్ 23వ తేదీన ఆంధ్రప్రదేశ్ ఎకనమిక్ డెవలప్మెంట్ బోర్డ్ (ఏపీఈడిబి) ఆధ్వర్యంలో సిఐఐ (కాన్ఫడరేషన్ ఇండియన్ ఇండస్ట్రీ ) పార్టనర్షిప్ సుమ్మిట్ - 2026 రీజనల్ కాన్ఫరెన్స్ నిర్వహించబోతుండగా, ఇందుకు సంబంధించి ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ ఎకనమిక్ డెవలప్మెంట్ బోర్డ్ (ఏపీఈడిబి) సీఈఓ సగిలి షణ్మోహన్, జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పేర్కొన్నారు. శనివారం సిఐఐ భాగస్వామ్య సదస్సు - 2026 రీజనల్ కాన్ఫరెన్స్ నేపథ్యంలో నగరంలోని జేఎన్టీయూలోని ఎన్టీఆర్ ఆడిటోరియంలో, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ లో, అతిథి గృహంలో ముందస్తుగా ఏర్పాట్లను ఆంధ్రప్రదేశ్ ఎకనమిక్ డెవలప్మెంట్ బోర్డ్ సీఈఓ, జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీఈడిబి సీఈఓ మాట్లాడుతూ సిఐఐ భాగస్వామ్య సదస్సు నేపథ్యంలో కార్యక్రమానికి వచ్చే డెలిగేట్స్, వీఐపీల కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలన్నారు. ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. జేఎన్టీయూలో ఆడిటోరియం అందంగా కనిపించాలని, చుట్టుప్రక్కల ప్రాంతాల్లోముందుగానే పిచ్చిమొక్కలను తొలగించి పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆడిటోరియం, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్, జేఎన్టీయూ అతిథి గృహం, తదితర ప్రాంతాల్లో పర్యటించి సీఈఓ పలు సూచనలు జారీ చేశారు. ఈ సిఐఐ భాగస్వామ్య సదస్సులో రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు, సీనియర్ పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు పాల్గొంటారు. జిల్లాలో ప్రాధాన్యత రంగాలకి అనుగుణంగా ఉన్న స్థానిక అవకాశాలను ప్రదర్శించడం, పెట్టుబడి అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేయడం, ప్రాంతీయ ఎంఎస్ఎంఈలు మరియు పరిశ్రమలను జాతీయ మరియు ప్రపంచ భాగస్వాములతో అనుసంధానించడం చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీనివాస యాదవ్, ఎకనమిక్ డెవలప్మెంట్ బోర్డ్ మేనేజర్ అనంత్, ఏపీఐఏసీ జెడ్ఎం నాగకుమార్, జేఎన్టీయూ విసి సుదర్శన్ రావు,పరిశ్రమలశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రాజశేఖర్ రెడ్డి, ఆర్డీవో ప్రేమంతకుమార్, తహసీల్దార్ రాజా, నెడ్క్యాప్ మేనేజర్ కిరణ్, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ అధికారులు, ఇంచార్జి హార్టికల్చర్ జిల్లా అధికారి ధనుంజయ్, తదితరులు పాల్గొన్నారు.

- ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేపట్టాలి
- ఆంధ్రప్రదేశ్ ఎకనమిక్ డెవలప్మెంట్ బోర్డ్ సీఈఓ సగిలి షణ్మోహన్, జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్
- నగరంలోని జేఎన్టీయూలో ముందస్తుగా ఏర్పాట్లను పరిశీలించిన ఆంధ్రప్రదేశ్ ఎకనమిక్ డెవలప్మెంట్ బోర్డ్ సీఈఓ, జిల్లా కలెక్టర్

# 22న గుడిబండ శ్రీ తుమ్మల మారమ్మ జాతర మహోత్సవం

– దేవస్థానం ప్రధానపూజారప్ప తిప్పేస్వామి



**గుడిబండ, సెప్టెంబర్ 19,మనంన్యూస్:** ఇదే నెల 22న మంగళవారం మండల కేంద్రమైన గుడిబండ గ్రామ పొలిమేరలో వెలసి భక్తుల కోర్కెలను తీరుస్తున్న శ్రీ తుమ్మల మారమ్మ జాతర మహోత్సవం ను ఘనంగా నిర్వహించనున్నట్లు దేవస్థానం ప్రధాన పూజారప్ప తిప్పేస్వామి తెలిపారు. ఈ సందర్భంగా పూజారప్ప మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరంకూడాఅమ్మవారిజాతర మహోత్సవంలో భాగంగా గుడిబండ గ్రామస్తులతోపాటు, చుట్టూప్రక్కల గ్రామాల భక్తులు భక్తిశ్రద్దలతో హారతులు(దీపాలతో ఊరేగి అమ్మవారికి దీపాలు అర్పించి తమ మొక్కుబడిని తీర్చుకుంటారన్నారు. అమ్మవారికి వివిధపూలు, పూల మాలతో అలంకరణ చేసి ప్రత్యేకపూజలు జరిపి మహామంగళ హారతి, తీర్థప్రసాదంవితరణ చేయడంజరుగుతుందన్నారు. జాతర మహోత్సవం సందర్భంగా భక్తులకు విందుభోజనంనిర్వహించడంజరుగుతుందన్నారు. కావునశ్రీ తుమ్మలమారమ్మ జాతర హారతిమహోత్సవంనకు సకల భక్త జనులు హాజరై అమ్మవారి కృపకు పాత్రులు కావాల్సిందిగా పూజారప్ప తిప్పేస్వామి కోరారు.



# రెండు నిండు ప్రాణాలను కాపాడిన దేవుడి రూపంలోని డాక్టర్ తిప్పేస్వామి

– కృతజ్ఞతలు తెలిపిన బాధిత కుటుంబ సభ్యులు



**మడకశిర, సెప్టెంబర్ 19,మనంన్యూస్:**
రెండు నిండు ప్రాణాలను కాపాడిన దేవుడి రూపం లోని డాక్టర్ ఎం.తిప్పేస్వామికి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియ జేశారు. వివరాల్లోకి వెళితే చిత్తూరు జిల్లా పలమనేరులోని మాజీ ఎమ్మెల్యే, వైసిపి సిఇసి సభ్యుడు డాక్టర్ ఎం. తిప్పేస్వామి వారి సొంత హాస్పిటల్ లో రెండు క్లిష్టమైన ఆపరేషన్లు విజయవంతంగా పూర్తి చేయడం విశేషం. తమిళనాడుకు చెందిన ఇద్దరు మహిళలు బీపీ, షుగర్ ఎక్కువగా ఉండటం వల్ల తమిళనాడులోని పెద్ద ఆసుపత్రుల్లో కూడా ఆపరేషన్ చేయలేమని అక్కడి వైద్యులు తేల్చి చెప్పడంతో దీర్ఘాలోచనలో పడ్డ ఆ కుటుంబ సభ్యులు వారు పలమలేరు లోని డాక్టర్ తిప్పేస్వామి అస్పత్రికి వచ్చి తమ గోడును వినిపించారు. తక్షణమే స్పందించిన మడకశిర మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి ఎంతో ధైర్యసాహసాలతో వారిని తన సొంత ఆసుపత్రిలో అడ్మిట్ చేసుకున్నారు. మెరుగైన ట్రీట్మెంట్ ఇచ్చి, గర్భసంచిలోని రెండు పెద్ద గడ్డలను చాక చక్యంగా తొలగించి ఆపరేషన్ విజయవంతంగా సక్సెస్ చేసి తొలగించారు. దీంతో రెండు నిండు ప్రాణాలను కాపాడారు. ఆపరేషన్ విజయవంతం కావడంతో కుటుంబ సభ్యులు ఆనంద భాష్పాలతో డాక్టర్ ఎం. తిప్పేస్వామికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# నాడు ప్రభుత్వ పాఠశాల కళాశాల బాలుర వసతి గృహంనకు రూ కోట్లు విలువ చేసే 9ఎకరములు స్వంత పట్టా భూమి దానం

– నేడు స్థలం దాత బాబాజీ లక్ష్మణ్ దాస్ నామ స్మరణం కనుమరుగు

– జిల్లా కలెక్టర్ కు పిర్యాదు చేసిన దాతల మనవడు రవిచంద్ర

**అమరాపురం, సెప్టెంబర్ 19,మనంన్యూస్:** మండల కేంద్రమైన అమరాపురం నడి రోడ్డులో ప్రస్తుతం రూ కోట్లు విలువ చేసే తమ సొంతం పట్టా భూమిని దాత స్వర్గీయ బావాజీ లక్ష్మణ దాస్ 9ఎకరముల పై చిలుకు భూమిని నాడు ప్రభుత్వశీనకు దానం చేసిన విషయం తెల్సిందే. అయినను నేడు ఆ స్థలం కొంతవరకు అన్యాక్రాంతం కావడం, స్థల దాతల పేరు మీద ఉన్న పాటశాల పేరును తొలగించడంతో స్థల దాతల వారసుదారుడు రవిచంద్ర శనివారం అమరాపురం పర్యటనకు వచ్చిన జిల్లా కలెక్టర్ ఏ. శ్యాం ప్రసాద్ కు దురా క్రమణకు గురైన స్థలం సర్వే నిర్వహించాలని, తమ తాత బావాజీ లక్ష్మణదాస్ పేరు మీద ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పేరును యథా విధిగా కొనసాగించాలని కోరుతూ రవిచంద్ర వినతి పత్రం అందించి అభ్యర్థించారు. వినతి పత్రం పట్ల తక్షణమే స్పందించిన జిల్లా కలెక్టర్ దీనిపై వెంటనే చర్యలు తీసుకుని విచారణ జరిపి పాఠశాలకు బావాజీ లక్ష్మణ దాస్ పేరును యథా విధిగా కొనసాగించే దిశగా చూడాలని స్థానిక తహసీల్దార్ ను ఆదేశించారు. 1952 సంవత్సరం నుండి ఈ స్థలంలో నిర్మించిన ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలకు స్థల దాత బావాజీ లక్ష్మణ దాస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలగా నామకరణం చేస్తూ ప్రభుత్వం అప్పట్లోనే ఉత్త ర్వులను జారీ చేసిన విషయం తెలిసిందే. ఇదే స్థలంలో ప్రభుత్వం జూనియర్ కళాశాల ,షెడ్యూల్డ్ కులాల బాలుర వసతి గృహం, ఉన్న విషయం తెల్సిందే. అయినను ఈ స్థలంకొంతవరకు దురక్రమణకు గురి కావడంతో స్థలశీ దాతల మనవడు రవిచంద్ర న్యాయ పోరాటం చేస్తున్న విషయం తెల్సిందే. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ చొరవతోస్థానిక రెవెన్యూఅధికారులువిచారణచేపట్టనున్నట్లు తెలిపారు.



# వక్క తోటలో వేసిన పిఎండిఎస్ విధానాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్



**అమరాపురం, సెప్టెంబర్ 19,మనం న్యూస్:**
అమరాపురం మండలం, బసవనపల్లి గ్రామంలో ఓ రైతు వక్క తోటలో వేసిన పిఎండిఎస్ విధానాన్ని శ్రీ సత్య సాయి జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ శనివారం పరిశీలించారు. నీలకంఠాపురం శ్రీరామ రెడ్డి తాగునీటి ప్రాజెక్ట్ పథకం ద్వారా నిర్మించిన అమరాపురం, బసవనపల్లి గ్రామాల్లో నీటి సంపులను పరిశీలించేందుకు వచ్చిన జిల్లా కలెక్టర్ బసవనహల్లి గ్రామంలోని రైతు పుష్పలత భర్త శంకరప్ప వక్క తోటలో వేసిన పిఎండిఎస్ సాగు విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైతులతో ముఖా ముఖిగా మాట్లాడుతూ మండలంలో ప్రతి ఒక్క రైతులు కూడా పిఎండిఎస్ వేసే విధానాన్ని అనుసరించాలని రైతులకి సూచించారు. పిఎండిఎస్ పంట విధానం పట్ల రైతులకు కలిగే ప్రయోజనం, ఉపయోగాలు గురించి అమరాపురం మండల వ్యవసాయ శాఖ అధికారి మంజునాథ్ స్పష్టంగా వివరించారు. విత్తనాలను పెల్లెటైజేషన్ చేయడం ద్వారా విత్తనానికి రక్షణ కవచంగా ఉండి వర్షం వచ్చినప్పుడు పంటలు మొలకెత్తుతాయని అయన తెలియజేశారు. అలాగే ఈ విధానం ద్వారా పంటకు ఇచ్చిన నీరు ఆవిరి కాకుండా పంటకు మల్చింగ్ లాగా ఉపయోగపడుతుందన్నారు. దీనిద్వారా తేమను నిలుపుకునే గుణం పెరుగుతుందన్నారు. కలుపు మొక్కలు తగ్గుతాయని, పంట పొలాలు 365 రోజులు గ్రీన్ కవర్ పచ్చదనం ఉంటుందన్నారు. రైతులు కూరగాయలు, ఆకుకూరల ద్వారా కొంత ఆర్థిక లాభం కూడా పొందెందుకు ఈ విధానం ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. ముఖ్యంగా పశువులకు మేతగా ఉపయోగపడుతుందనిరైతులకు తెలియజేశారు. ముఖ్యంగా ఇప్పుడు ఉన్న వర్షాభావ పరిస్థితుల్లో వీలైతే రైతులు నీటి సదుపాయం ఉన్న వక్క రైతుల నుంచి ఒక రక్షకతడిని పంటలకు అందించాలని ఎఓ వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ మడకశిర ఎడిఎ కృష్ణ మీనన్,సిరికల్చర్ ఎడి హనుమంతునాయక్,ఎంపీడీఓ డి. రామారావు, తహసీల్దార్ బి. హనుమంతు, అమరాపురం, గుడిబండ ఎఓలు మంజునాథ్,వీరనరేష్, ఏపీఓ శివన్న తదితరులు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.



# తుమ్మల మారమ్మ దేవస్థానం రోడ్డులో కంపచెట్లు తొలగింపు

**గుడిబండ సెప్టెంబర్ 19 మనంన్యూస్ :**
గుడిబండ మండల కేంద్రంలోని శ్రీ తుమ్మల మారమ్మ దేవస్థానం పోవు రహదారి ముళ్ళకంపల చెట్లతో ఇబ్బందికరంగా ఉండడంతో శనివారం హెచ్.పీ గ్యాస్ ఏజెన్సీ జిబి సుధాకర్ తన సొంత నిధులతో జెసిపి సహాయంతో ముళ్ళకంపచెట్లను తొలగించి రహదారి ఏర్పాటు చేశారు. దేవస్థానమునకు పోవు భక్తులు రోడ్డు ఇబ్బందికరంగా ఉండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతుండేవారు. ద్విచక్ర వాహనాలు కూడా పోవడానికి ఇబ్బంది పడుతుండే సమయంలో రహదారి ఏర్పాటు చేయడం చాలా సంతోషకరమని గుడిబండ గ్రామస్తులు పేర్కొన్నారు. ప్రభుత్వ అధికారులకు ప్రజాప్రతి నిధులకు పలుమార్లు విన్నవించుకున్న రహదారి లో ఉన్న కంప చట్టం తొలగించలేదని పెద్ద మనసుతో జిబి సుధాకరన్న రోడ్డులోని కంపచెట్లను తొలగించి భక్తులకు సుగమం చేయడంతో గ్రామస్తులు దేవాలయ అర్చకులు తిప్పేస్వామి,పట్టాదతిప్పేస్వామి, చిరంజీవి, రంగనాథప్ప జి బి సుధాకర్ కు కృతజ్ఞతలు తెలిపారు



## స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆశీధ్రతో పరిశుభ్రతకు పెద్దపీట

- జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్



**మడకశిర, సెప్టెంబర్ 19,మనంన్యూస్:** స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణ ఆంధ్ర పథకంతో పరి శుభ్రత ప్రభుత్వ పెద్ద పీఠం వేసిందని శ్రీ సత్య సాయి జిల్లా కలెక్టర్ ఎ. శ్యాం ప్రసాద్ తెలిపారు.మడకశిర నగర పంచాయతీ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణ ఆశీధ్ర కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ తో పాటు మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామిలు పాల్గొన్నారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిశుభ్రత, పచ్చదనం, ప్రజల భాగస్వామ్యంతో మడకశిరను మరింత పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అయన పిలుపునిచ్చారు. మొక్కలు నాటి నీరు పోసి పర్యావరణ పరిరక్షణకు పిలుపునిచ్చారు. అనంతరం మున్సిపల్ సిబ్బందికి ప్లాస్టిక్ రహిత బ్యాగులను పంపిణీ చేశారు.పరిశుభ్రమైన మడకశిర, పచ్చని మడకశిర లక్ష్యంగా మనమందరం పాటు పడుదామని కమిషనర్ మురళిదర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నగరపంచాయతీ అధికారులు, సిబ్బంది,నాయకులు, పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



## ఏపీఈడిబి సీఈఓకు స్వాగతం పలికిన కలెక్టర్



**అనంతపురం, కలెక్టరేట్ సెప్టెంబర్ 19 మనం న్యూస్ :** అనంతపురంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో శనివారం జిల్లా పర్యటనకు విచ్చేసిన ఏపిఈడిబి సిఈఓ సగిలి షణ్మోహన్ ను జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందించి ఘన స్వాగతం పలికారు

## మహారాజా గణపతి హిందూ మహా గణపతిలకు ప్రత్యేక పూజలు

- చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ దినకర్

**అమరాపురం, సెప్టెంబర్ 19,మనంన్యూస్:**
మండల కేంద్రమైన అమరాపురం పట్టణంలోని పాత పోలీస్ స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన మహారాజా గణపతి, పాత పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఏర్పాటు చేసిన హిందూ మహా గణపతిలకు చిన్న పిల్లలు పురిటి పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ ఎం. దినకర్ తమ కుటుంబ సభ్యులతో కలసి ప్రత్యేక పూజలు జరిపించి గణ నాథులను దర్శించుకున్నారు. మహా మంగళ హారతి తీర్థ ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గుడిబండ మండలం వెలుగు సీసీ దేవరాజు కుటుంబ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.





# రాగి సాగుతో రైతులకు మెరుగైన ఆదాయంవిస్తీర్ణం పెంచాలి

- కదిరేపల్లి గ్రామంలో రాగి పంటను పరిశీలించిన జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్



**మడకశిర, సెప్టెశీబర్ 19,మనం న్యూస్:**
రాగి సాగుతో రైతులకు మెరుగైన ఆదాయం వస్తుందని తద్వారా రాగి పంట విస్తీర్ణం ను పెంచుకోవాలని శ్రీ సత్య సాయి జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ తెలిపారు.మడకశిర మండలం, కదిరేపల్లి గ్రామరైతులు సాగుచేసిన రాగి పంటలను శనివారం అయన సందర్శించి పరిశీలించారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ పంటల వైవిధ్యీకరణలో భాగంగా రైతులు తక్కువ లాభదాయకమైన వరి సాగు నుంచి అధిక ప్రతిఫలం అందించే ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లాలని జిల్లా అయన సూచించారు. ఈ సందర్భంగా కదిరేపల్లి గ్రామానికి చెందిన రైతు నరసింహప్ప సాగు చేస్తున్న రాగి పంటను జిల్లా కలెక్టర్ తో పాటు క్షేత్రస్థాయి అధికారులతో కలసి పరిశీలించారు.వరి పంటతో పోలిస్తే తక్కువ నీటి అవసరంతో సాగు చేయగలిగే రాగి పంటకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందన్నారు. రైతులకు మెరుగైన ఆదాయం అందించే అవకాశం ఉన్నందున రాగి సాగు విస్తీర్ణాన్ని మరింత పెంచాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా నీటి వనరులలభ్యత,నేలస్వభావం, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు పంటలను ఎంపిక చేసుకోవాలని అయన తెలిపారు.రాగి పంటను ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.5,200/- ధరతో కొనుగోలు చేయనున్నందున, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని రాగి సాగును ప్రోత్సహించుకోవాలని కలెక్టర్ సూచించారు. పంటల వైవిధ్యీకరణ ద్వారా ఒకే పంటపై ఆధారపడకుండా వ్యవసాయంలో స్థిరమైన ఆదాయాన్ని పొందేందుకు అవకాశం ఉంటుందని అయన తెలిపారు.రైతులు సాగు చేసిన పంటనే ఈ-క్రాప్‌లో నమోదు చేయాలని,ప్రతి రైతు తాను వాస్తవంగా సాగు చేసిన పంట వివరాలను తప్పనిసరిగా ఈ-క్రాప్ బుకింగ్‌లో నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. రైతులు సాగు చేసిన పంటకు అనుగుణంగా ఈ-క్రాప్ నమోదు చేయించుకోవడం ద్వారా ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు.ఈ-క్రాప్ బుకింగ్ కేవలం పంట నమోదు ప్రక్రియ మాత్రమే కాకుండా, రైతులకు అందించే పంట బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ తదితర ప్రభుత్వ ప్రయోజనాలకు కీలక ఆధారంగా ఉంటుందని వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు వివరించారు. అందువల్ల రైతులు తమ పొలాల్లో సాగు చేసిన పంట వివరాలను ఖచ్చితంగా నమోదు చేయించుకోవాలని, పంట మార్పులు జరిగినప్పుడు సంబంధిత వ్యవసాయ సిబ్బందికి సమాచారం అందించాలన్నారు.రబీలో చియా సాగును ప్రోత్సహించాలన్నారు.నీటి వసతి ఉన్న ప్రాంతాల్లో రబీ సీజన్‌లో సంప్రదాయ పంటలతో పాటు చియా పంట సాగును కూడా ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. పంటల వైవిధ్యీకరణలో భాగంగా రైతులు మార్కెట్ డిమాండ్, సాగు ఖర్చు, నీటి లభ్యత, పంట కాలం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని అయన తెలిపారు.రబీ సీజన్‌లో సాగునీటి వసతి ఉన్న రైతులు చియా వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయడం ద్వారా పంటల వైవిధ్యీకరణ సాధించడంతో పాటు కొత్త మార్కెట్ అవకాశాలను అన్వేషించవచ్చని అయన సూచించారు. రైతులకు అవసరమైన సాంకేతిక సూచనలు, సాగు విధానంపై వ్యవసాయ శాఖ సిబ్బంది ద్వారా అవగాహన కల్పించాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రైతు నరసింహప్పతో రాగి సాగు విధానం, సాగు ఖర్చులు, దిగుబడి, నీటి వినియోగం, పంట విక్రయ అవకాశాల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులు తమ ప్రాంతానికి అనుకూలమైన పంటలను ఎంచుకొని, పంటల వైవిధ్యీకరణను చేపట్టడం ద్వారా వ్యవసాయాన్ని మరింత లాభదాయకంగా మార్చుకోవాలని జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మడకశిర వ్యవసాయ శాఖ ఎడిఎ కృష్ణమీనన్, మడకశిర పట్టు పరిశ్రమ శాఖ ఎడి హనుమంత నాయక్,స్థానిక తహసీల్దార్ ముకుంద,మండల వ్యవసాయశాఖ అధికారి వడ్డే తిమ్మప్ప, సెరికల్చర్ ఆఫీసర్ శ్రావణి,ఎఇఓలు కౌసర్, దివ్య జ్యోతి, స్థానిక నాయకులు, రైతులు పాల్గోన్నారు.

## జమ్ములబండలోని ప్రభుత్వ పట్టు పరిశ్రమ శాఖ ఫారంను సందర్శించిన జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్



**మడకశిర, సెప్టెంబర్ 19,మనంన్యూస్:**
మడకశిర నియోజక వర్గంలోని జమ్మలబండ గ్రామం వద్ద గల ప్రభుత్వ పట్టు పరిశ్రమ శాఖ పారంను శనివారం జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ సందర్శించారు.ఈ సందర్శనలో భాగంగా కలెక్టర్ వన్య పట్టుపురుగులకు సంబంధించిన టస్సర్ పట్టు పురుగుల ఆహార మొక్కలైన టెర్మినేలియా అర్జున, టెర్మినేలియా టొమెంటోసా, మూగా పట్టు పురుగుల ఆహార మొక్కలైన సోమ్, సోలు మొక్కల పెంపకాన్ని అయన పరిశీలించారు. మడకశిర డివిజన్ పట్టు పరిశ్రమ సిబ్బంది చేపట్టిన క్షేత్ర స్థాయి అభివృద్ధిని కలెక్టర్ అభినందించారు.టస్సర్, మూగా ఆహార మొక్కలు, వన్య పట్టు పురుగుల పెంపకం గురించి మడకశిర పట్టు పరిశ్రమ శాఖ ఎడిలు స్పష్టంగా వివరించారు.టస్సర్, మూగా ఆహార మొక్కల పెంపకం, వన్య పట్టు పురుగుల పెంపకానికి సంబంధించి దశలవారీగా పురోగతి నివేదికను సిద్ధం చేయాలని స్థానిక పట్టు పరిశ్రమ శాఖ అధికారులను అయన ఆదేశించారు.ఈ టస్సర్, మూగా ఆహార మొక్కల అభివృద్ధిని సాసా కార్యక్రమం కింద మడకశిర డివిజన్ పట్టు పరిశ్రమ శాఖ సిబ్బంది చేపట్టారు. ఈ మొక్కల మధ్యలోవివిధ రకాల విత్తనాలతో ప్రే - మొమోన్ సూన్, మొన్సూన్ డ్రై సోవింగ్ పాటించడం జరిగింది.ఈకార్యక్రమంలో మడకశిర పట్టు పరిశ్రమ శాఖ ఎడిఎచ్.హనుమంతరాయనాయక్, వ్యవసాయ శాఖ ఎడిఎ కృష్ణమీనన్, గుడిబండ మండల వ్యవసాయ శాఖ అధికారి వీరనరేష్, ఎస్ఓ, ఎఎస్ఓ, క్షేత్ర స్థాయి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ఆ భూమి మా బంధువులదే..

■ పత్రాలు పరిశీలిద్దాం.. నిజాలు తేల్చుదాం ! ■ బుడగ జంగాల అంజికి చితంబర దొర, బీకేఎస్ ఆనంద్ సవాల్



**అనంతపురం, సెప్టెంబర్ 19 మనంన్యూస్ :**
బుడగ జంగాల అంజి తనది కాని భూ వివాదంలో బాధితులను రెచ్చగొడుతూ అసత్య ఆరోపణలు చేస్తూ కాలం వెల్లదీస్తున్నాడని భూ యజమానులు చితంబర దొర, బీకేఎస్ ఆనంద్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం వారు మీడియాతో మాట్లాడారు. బుడగ జంగాల అంజి చెబుతున్న స్థలం తమ బంధువులదేనని, 40 ఏళ్ల కిందట ఏకుల రత్నమ్మ పేరుపై డైక్లాట్‌లో ఉందని, కోర్టు కూడా తమకు అనుకూలంగానే తీర్పు ఇచ్చిందన్నారు. అవసరమైతే ప్రజా సంఘాలు, అధికారులతో కూడిన నిజ నిర్ధారణ కమిటీ వేసి ఇరుపక్షాల పత్రాలను పరిశీలించేందుకు నిజ నిజాలు తేల్చేందుకు నీవు సిద్ధమా ? అంటూ సవాల్ విసిరారు. 75/4 సర్వే నెంబర్ భూమిలో తమకు అన్ని పత్రాలు ఉన్నాయని, అయితే వీరు మరో సర్వే నెంబర్‌లో భూమి కొనుగోలు చేసి రెండింటి మధ్య వివాదాన్ని లేవనెత్తి కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను బాధితులకు మరోలా తప్పుదోవ పట్టిస్తూ.. తమకు పూర్వం నుంచి వచ్చిన ఆస్తిపై వివాదాలు రేకెత్తిస్తున్నారని విమర్శించారు. వారు కొనుగోలు చేసిన భూ సర్వేనెంబర్‌కు మాకు చెందిన భూ సర్వేనెంబర్‌కు ఎలాంటి సంబంధం లేకున్నా.. బుడగ జంగాల అంజి పనికట్టుకుని బాధితులందరినీతమవైపు ఉసగొల్పుతూతమది కాని భూమిని చేజిక్కించుకునేందుకు కుట్ర పన్నుతున్నా రని, ఇది ఏమాత్రం సమర్థనీయం కాదన్నారు. ఇప్పటికైనా వాస్తవాలుతెలుసుకునేం దుకు నిజ నిర్ధారణ కమిటీ పత్రాల పరిశీలనకు వేదిక నువ్వు చెప్పినా సర్వే.. మేం చెప్పినా సరే.. అందుకు నీవు సిద్ధమా ? అని నువ్వే తేల్చుకోవాలని సవాల్ విసిరారు.సమావేశంలోమురళి, మాజీ మార్కెట్ యార్డు డైరెక్టర్ చంద్రమోహన్, జిల్లావడ్డెరసంఘం జిల్లా ఉపాధ్యక్షులు గోగుల నాగభూషణం, ఎస్సీ సెల్ మండల కార్యదర్శి ఓబులయ్య తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారి అశ్వర్ధ గుణదత్తకు ఆర్థిక సాయం అందించిన ఎమ్మెల్యే



- అరుదైన వ్యాధితో బాధపడుతున్న కర్నూలు జిల్లాకు చెందిన చిన్నారి
- ఒక నెల వేతనానికి సంబంధించిన చెక్కును ఎంపీ అంబికా లక్ష్మీనారాయణతో కలిసి అందజేసిన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

**అనంతపురం, సెప్టెంబర్ 19 మనంన్యూస్ :** అరుదైన వ్యాధితో బాధపడుతున్న మూడేళ్ల అశ్వర్ధ గుణదత్తకు అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తన నెల రోజుల వేతనాన్ని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణతో కలిసి సాయంగా అందజేశారు. కర్నూలు జిల్లాకు చెందిన హరీష్ కుమార్, నవ్యశ్రీ దంపతులకు ఇద్దరు సంతానం కాగా పెద్దకుమారుడు అశ్వర్ధ గుణదత్త(3)కు జన్యుపరఅరుదైన వ్యాధి సోకింది. ఈ వ్యాధి కారణంగా కండరాలు బలహీనమై నిల్చోలేని, కూర్చోలేని పరిస్థితి. ఖరీదైన ఇంజెక్షన్ వేయించాలని, లేకపోతే చిన్నారికి ఇవ్వకపోతే ప్రాణానికే ప్రమాదం అని వైద్యులు తెలిపారు. సామాజిక మాధ్యమం ద్వారా ఈ సమాచారాన్ని తెలుసుకున్న అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ గతంలోనే స్పందించారు. చిన్నారి వైద్య ఖర్చులకు నెలజీతం అందజేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. శనివారం రోజు ఎమ్మెల్యే దగ్గుపాటి ఆ చిన్నారి తాతయ్య పుల్లయ్యకు తన నెల రోజుల వేతనానికి సంబంధించిన చెక్కును ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ తో కలిసి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అందజేశారు. చిన్నారి ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా తీశారు. భవిష్యత్ ఆ చిన్నారికి మరింత సాయం అందేలా మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వ పరంగా సాయం అందేలా చూస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ హామీ ఇచ్చారు.

# పోటీ పరీక్షలకు అవసరమైన మెటీరియల్ అందుబాటులో ఉంచండి

### జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్



**అనంతపురం, సెప్టెంబర్ 19 మనంన్యూస్ :** అనంతపురం జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ శనివారం మధ్యాహ్నం జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన గ్రంథాలయ ప్రాంగణాన్ని కలియతిరిగి, పాఠకులకు అందుతున్న సౌకర్యాలు మరియు మౌలిక వసతుల గురించి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి జె. శివప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల ఏపీపీఎస్సీ విడుదల చేసిన ఉద్యోగ నోటిఫికేషన్లను దృష్టిలో ఉంచుకుని, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు అవసరమైన అన్ని రకాల పోటీ పరీక్షల పుస్తకాలను, ప్రామాణిక మెటీరియల్‌ను అందుబాటులో ఉంచాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో చదువుకుంటున్న విద్యార్థులు, నిరుద్యోగ యువతతో కలెక్టర్ నేరుగా మాట్లాడి, వారికి ఏ విధమైన పుస్తకాలు కావాలి, ఇతర వసతులు ఎలా ఉన్నాయనే అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠకులకు అవసరమైన పోటీ పరీక్షలకు సంబంధించిన అన్ని పుస్తకాలను అందుబాటులో ఉంచాలను, పాఠకులకు మెరుగైన సౌకర్యాలు అందించాలని కలెక్టర్, కార్యదర్శి జె.శివప్రసాద్‌ని ఆదేశించారు. అనంతరం, ప్రాంగణంలోని ఎన్.టి.ఆర్. స్టడీ సెంటర్ పురోగతిపై ఆరా తీసిన కలెక్టర్, దానికి సంబంధించిన పనులను త్వరితగతిన పూర్తి చేసి పాఠకులకు అందుబాటులోకి తెస్తామని తెలిపారు. ఇదే సమయంలో, అనంతపురం జిల్లాలోని మున్సిపాలిటీలు మరియు స్థానిక సంస్థల నుండి గ్రంథాలయానికి రావాల్సిన బకాయి ఉన్న 'లైబ్రరీ సెస్' వివరాలను కార్యదర్శి జె.శివప్రసాద్‌కలెక్టర్‌దృష్టికితీసుకెళ్లారు. ఈఆకస్మిక తనిఖీ కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ కమ్మన్న, ప్రతాప్ రెడ్డి, జయరాం, రవికుమార్ నాయుడు, రామాంజినేయులు, గోవిందు, సీనియర్ అసిస్టెంట్ రాజు, సిబ్బంది రామాంజినమ్మ, కిరణ్, జీవన మరియు ఇతర గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

# ఆదినారాయణరెడ్డికి హరీష్‌బాబు పరామర్శ

**బత్తలపల్లి, సెప్టెంబరు 19, మనంన్యూస్ :** తంబాపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు ఆదినారాయణరెడ్డిని నియోజకవర్గ ఇన్‌చార్జి హరీష్‌బాబు శనివారం పరామర్శించారు. ఇటీవల వైఎస్సార్‌సీపీ నాయకుల దాడిలో గాయపడిన ఆదినారాయణరెడ్డి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ఘటన వివరాలను తెలుసుకున్నారు. బాధిత కుటుంబానికి మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్‌యాదవ్, ఎన్డీఏ ప్రభుత్వం అండగా ఉంటుందని హరీష్‌బాబు భరోసా ఇచ్చారు. అనంతరం మంత్రి సత్యకుమార్‌యాదవ్‌తో ఫోన్‌లో ఆదినారాయణరెడ్డి, ఆయన కుటుంబ సభ్యులను మాట్లాడించారు. మంత్రి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యంగా ఉండాలని సూచించారు. ఘటనపై పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నట్లు తెలిపారు. దాడికి బాధ్యులైన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు. నేరానికి పాల్పడిన వారు ఎంతటి వారైనా చట్టపరంగా చర్యలు తీసుకుని శిక్ష పడేలా చూస్తామని మంత్రి బాధిత



కుటుంబానికి హామీ ఇచ్చారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం సహకరిస్తుందని తెలిపారు. రాజకీయ కారణాలతో దాడులకు పాల్పడితే ఉపేక్షించబోమని హరీష్‌బాబు పేర్కొన్నారు.

# వర్షిత కుటుంబానికి అండగా హరీష్ బాబు



**ధర్మవరం, సెప్టెంబర్ 19 మనం న్యూస్ :** కదిరి గేటు వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన శారదానగర్‌కు చెందిన తొమ్మిదేళ్ల చిన్నారి వర్షిత కుటుంబాన్ని నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్ బాబు శనివారం పరామర్శించారు. మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ ఆదేశాల మేరకు కుటుంబానికి అండగా నిలిచిన ఆయన.. పోస్టుమార్టం ప్రక్రియ పూర్తిచేయించడంతో పాటు దహన సంస్కారాలు పూర్తయ్యే వరకు కుటుంబ సభ్యులకు అందుబాటులో ఉన్నారు. చిన్నారి మృతిపట్ల సంతాపం వ్యక్తం చేసిన హరీష్ బాబు.. ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులు అధైర్యపడవద్దని, ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రమాదంలో గాయపడి ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను కూడా ఆయన పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. బాధిత కుటుంబానికి అవసరమైన సహాయం అందించేందుకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని హరీష్ బాబు పేర్కొన్నారు.



# తప్పుదారి పట్టించే ప్రకటనల నుంచి రక్షణ పొందాలి






**ధర్మవరం, సెప్టెంబరు 19, మనంన్యూస్ :** తప్పుదారి పట్టించే ప్రకటనల నుంచి ప్రతి వినియోగదారుడు రక్షణ పొందాల్సిన అవసరం ఉందని ధర్మవరం వినియోగదారుల సంఘం అధ్యక్షుడు చిన్న తంబి చిన్నప్ప పేర్కొన్నారు. ధర్మవరం మండలం చిగిచెర్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం వినియోగదారుల అవగాహన సదస్సు నిర్వహించారు. పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చిన్న తంబి చిన్నప్ప మాట్లాడుతూ.. పిల్లలను లక్ష్యంగా చేసుకునే ఉత్పత్తుల ధరల్లో పారదర్శకత ఉండాలని, తప్పుదారి పట్టించే ప్రకటనల నుంచి పిల్లలను రక్షించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేసిన నెలవారీ క్యాలెండర్ ప్రకారం 'నో బ్యాగ్ డే' సందర్భంగా విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. మండల విద్యాశాఖాధికారి గోపాల్ నాయక్ అనుమతితో ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు కార్యక్రమం నిర్వహించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వినియోగదారుల సమాచార కేంద్రం అధ్యక్షుడు చిన్నతంబిచిన్నప్ప, సభ్యురాలుబి. నారాయణమ్మ, గౌరవ అధ్యక్షుడుజి. కుళ్లాయప్ప, ఉపాధ్యక్షుడుఎజన్న, సెల్వరాజ్, కార్యదర్శిగుర్రంవేణుగోపాల్, కోశాధికారిఎన్. సుబహాన్, సత్యసాయిజిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు పల్లెం జనార్ధన్, పాఠశాలఉపాధ్యాయులుచంద్రశేఖర్, పురుషోత్తం, ఇష్తాక్, సిబ్బంది పాల్గొన్నారు.

# మడకశిర ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్

### - ఎమ్మెల్యే ఎంఎస్ రాజు



**మడకశిర, సెప్టెంబర్ 19,మనంన్యూస్:** మడకశిర పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించినట్లు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తెలిపారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులనుఎమ్మెల్యే స్వయానా స్వీకరించారు. ప్రజాదర్బార్‌లో ప్రధానంగా పింఛన్లు, తాగునీరు, డ్రైనేజీ సమస్యలు, రోడ్ల మరమ్మతులు, ఇతరాత్ర సమస్యలపై అర్జీలు రావడం విశేషం. బాధితుల సమస్యలను ఓపికగా విన్న ఎమ్మెల్యే, తక్షణమే స్పందించి ఆయా శాఖల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగాఅయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు, మౌలిక వసతులు అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# షేక్ చాందిని... 12 కిలోల లడ్డూ రూ.1.45 లక్షలకు కైవసం



**ధర్మవరం, సెప్టెంబరు 19, మనంన్యూస్ :** పార్థసారథినగర్‌లోని సిద్ధి వినాయక ఉత్సవాలు మత సామరస్యానికి ప్రతీకగా నిలిచాయి. స్థానిక సెరికల్చర్ కార్యాలయం సమీపంలో సిద్ధి వినాయక ఉత్సవ కమిటీసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ పృథ్వీ,హర్ష వర్ధన్, వంశీ కృష్ణ,జయసింహ, ధీరజ్, ధను,శశి కుమార్ రెడ్డి,రాకేష్,సాయి కృష్ణ, గౌతమ్, రాహుల్, రఘు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లోభక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహిఒచిన లడ్డూ వేలంపాటలో ముస్లిం మహిళ షేక్ చాందిని రూ.1,45,000కు 12 కిలోల లడ్డూను దక్కించుకున్నారు. వినాయక చవితి సందర్భంగా సింగంశెట్టి సాయి పృధ్వి రూ.45 వేల విరాళంతో స్వామివారివిగ్రహాన్నిసమర్పించారు. నిమజ్జనంసందర్భంగా నిర్వహిఒచినవేలంపాటలో స్వామివారికలశాన్ని అంజలిరూ.15,500కు, కండువాను గుజ్జల మహేష్ రూ.3,700కు దక్కించుకున్నారు.అనంతరం భక్తుల జయ జయ ధ్వనుల మధ్య వినాయక నిమజ్జన శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. కులమతాలకు అతీతంగా భక్తులు పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేశారు.ముస్లిం మహిళలడ్డూనువేలంలో దక్కించుకోవడం ద్వారామత సామరస్యానికి ఈ ఉత్సవాలు వేదికగా నిలిచాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

## ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



**బొమ్మనహాల్ సెప్టెంబర్ 19 మనంన్యూస్ :** మండలంలోని ఎంతో ప్రసిద్ధ గాంచిన పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతోంది.నేమకల్లు ఆంజనేయ స్వామి దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆంజనేయస్వామి మూలవిరాట్టుకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరిం చారు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు కర్ణాటక రాష్ట్రానికి చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేయించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు అనిల్‌కుమారాచార్యులు ప్రత్యేక పూజా కార్యక్రమా లను నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆలయధర్మకర్తల మండలిచైర్మన్‌శ్రీనాథ్, కార్యనిర్వహణాధికారి నరసింహారెడ్డి, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావంపై విద్యార్థుల అవగాహనాత్మక వ్యాసరచన

**పెనుకొండ సెప్టెంబర్ 19 మనంన్యూస్ :** ప్రగతి, గ్లోబల్ జెన్ సీబీఎస్‌ఈ స్కూల్ పెనుకొండ ఆధ్వర్యంలో విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పులపై అవగాహన పెంపొందించే ఉద్దేశంతో "ఇంపాక్ట్ అఫ్ ఎల్ నినో ఆన్ సొసైటీ - వేస్ టూ టాక్లే ఇట్ " అనే అంశంపై వ్యాసరచన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఎల్‌నినో ప్రభావం సమాజంపై చూపే పరిణామాలను వివరిస్తూ, దాని ప్రభావాలను ఎదుర్కొనే మార్గాలపై తమ ఆలోచనలను వ్యాసాల రూపంలో వ్యక్తపరిచారు. అంశంపై స్పష్టత, క్రమబద్ధమైన రచన, సరైన పదజాలం, వ్యాకరణం, సృజనాత్మకత వంటి అంశాల ఆధారంగా విద్యార్థుల రచనలను పరిశీలించారు.ప్రథమ స్థానం: ఆర్ . అక్షర గగన్ రెడ్డి,ద్వితీయ స్థానం: పి . హాసిని, తృతీయ స్థానం: జి .దర్శినిలు విజేతలుగానిలిచారు. ఈసందర్భంగాచైర్మన్ యు . శ్రీనివాసులు , వై . మంజువాణి , ప్రిన్సిపాల్ శ్రీను బాబు ఊస , డైరెక్టర్లు సాయి శ్రీధర్ యస్ సాయి సృజన విజేతలను అభినందించారు. విద్యార్థుల్లో పర్యావరణ స్పృహ,సామాజిక బాధ్యత సృజనాత్మక ఆలోచనా విధానాన్ని పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు.



# రూ.1 కోటి సియస్ఆర్ నిధులతో పెనుకొండలో రైతు బజార్ నిర్మాణం

▪ మొదటి దశలో 48 స్టాళ్లు.. రెండో దశలో 200 స్టాళ్ల ఏర్పాటు ▪ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నాం: మంత్రి సవిత



**పెనుకొండ సెప్టెంబర్ 19 మనంన్యూస్ :** పట్టణ ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని పెనుకొండ మార్కెట్ సమీపంలో రూ.1 కోటి సియస్ఆర్ నిధులతో నిర్మించనున్న రైతు బజార్‌కు రాష్ట్ర బీసీ సంక్షేమం, చేనేత జౌళి శాఖ మంత్రి సవితమ్మ, జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ తో కలిసి శనివారం భూమిపూజ నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ రైతులు తమ పంటలను నేరుగా వినియోగదారులకు విక్రయించుకునేలా, ప్రజలకు నాణ్యమైన కూరగాయలు అందుబాటులో ఉండేలా రైతు బజార్‌ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మొదటి దశలో 48 స్టాళ్లను ఏర్పాటు చేయనున్నామని, రెండో దశలో మరో 200 స్టాళ్లను ఏర్పాటు చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు.పెనుకొండ పట్టణ అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి దశలవారీగా పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు.అలాగే పేద, నిరుపేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేసేందుకుచర్యలుతీసుకుంటున్నామన్నారు . ఇళ్ల పట్టాల





విషయంలో ఎన్నికలకు ముందే 1,500 మందికి పట్టాలు మంజూరయ్యాయని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు కల్పించే దిశగా ప్రభుత్వం పని చేస్తుందనివెల్లడించారు. పెనుకొండ నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు నిరంతరం ప్రాధాన్యత ఇస్తూ, ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని మంత్రి సవిత స్పష్టంచేశారు.ఈకార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు, మార్కెట్‌కమిటీప్రతినిధులుతదితరులు పాల్గొన్నారు.

# వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలని వినతి

**పెనుకొండ సెప్టెంబర్ 19 మనం న్యూస్ :** గ్రామ రెవెన్యూ సహాయకుల (వీఆర్‌ఏ) సమస్యలను తక్షణమే పరిష్కరించాలని పెనుకొండ మండల తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ బేబీకి ఏఐటీయూసీ నాయకులు, వీఆర్‌ఏ సంఘం ప్రతినిధులు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి రమేష్, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు షీలా నారాయణస్వామి మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 20 వేల మంది వీఆర్‌ఏలు గ్రామస్థాయిలో రెవెన్యూ వ్యవస్థలో కీలక సేవలు అందిస్తున్నారని తెలిపారు. అయితేవారికి ప్రస్తుతంనెలకుకేవలం రూ.10,500 వేతనం మాత్రమే అందుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.2018లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హయాంలో వీఆర్‌ఏల వేతనాన్ని రూ.10,500కు పెంచారని, అప్పటి నుంచి ఇప్పటివరకు వేతనంలో ఎలాంటి పెంపు జరగలేదని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్ల కాలంలో వీఆర్‌ఏల సమస్యలను అనేకసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు పరిష్కారం కాలేదని తెలిపారు. వీఆర్‌ఏల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని, ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత



ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం నాయకులు గంగరాజు, వీఆర్‌ఏల సంఘం నాయకులు నరసప్ప, అంజనప్ప, సుబ్బరాయుడు, తిమ్మయ్య, రాజేశ్వరి, గోవిందప్ప, రాము తదితరులు పాల్గొన్నారు.

# స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా పారిశుధ్య కార్యక్రమం



**ధర్మవరం, సెప్టెంబరు 19, మనంన్యూస్ :** స్థానిక కె.హెచ్. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. సుందరేశ్వరరావు అధ్యక్షతన, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ప్రోగ్రామ్ అధికారి ఆదినారాయణ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. పారిశుధ్యం ప్రతి ఒక్కరి బాధ్యత అని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. పరిశుభ్రమైన వాతావరణం ఆరోగ్యకరమైన జీవనానికి దోహదపడుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.అనంతరం ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు కళాశాల పరిసరాలను శుభ్రం చేశారు. ఆవరణలోని చెత్తను తొలగించి మొక్కలు నాటారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు.కార్యక్రమంలో ఏ. ఆదినారాయణ, డా. హరిప్రసాద్, మహీధర్‌రావు, బి. ఆనంద్, ఏ. సౌజన్యలక్ష్మి, ఎస్. ఒబులపతి తదితర అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



# వాయిద్యాల నడుమ గణనాథుడి నిమజ్జన శోభాయాత్ర

### భక్తిశ్రద్ధల మధ్య గణపతి నిమజ్జనం.. ఏర్పాట్లను పర్యవేక్షించిన హరీష్‌బాబు

**ధర్మవరం, సెప్టెంబరు 19 మనంన్యూస్ :** ధర్మవరం పట్టణంలో గణపతి నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా శనివారం గణనాథుడి నిమజ్జన శోభాయాత్ర అంగరంగ వైభవంగా జరిగింది. భక్తులు వాయిద్యాల నడుమ సంబరాలు చేసుకుంటూ గణపతి విగ్రహాలను నిమజ్జన ప్రదేశానికి తరలించారు. భక్తుల జయజయధ్వానాలతో పట్టణంలో పండుగ వాతావరణం నెలకొంది. మంత్రి సత్యకుమార్‌యాదవ్ ఆదేశాల మేరకు నియోజకవర్గ ఇన్‌చార్జి హరీష్‌బాబు నిమజ్జన ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు. నిమజ్జన ప్రదేశంలో భక్తుల కోసం ఏర్పాటు చేసిన సౌకర్యాలు, భద్రతా చర్యలు, అధికారుల సమన్వయాన్ని పరిశీలించారు. విగ్రహాల నిమజ్జనం సురక్షితంగా, సజావుగా జరిగేలా ఏర్పాటు చేసిన రెండు భారీ క్రేన్ల పనితీరును కూడా పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు.ఈ సందర్భంగా హరీష్‌బాబుమాట్లాడుతూ మంత్రి సత్యకుమార్ యాదవ్ సూచనల మేరకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తుగానే అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అధికారులు, ఉత్సవ కమిటీలు, పార్టీ నాయకులు సమన్వయంతో పని



చేశారనిచెప్పారు.నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా జరిగేందుకు సహకరించిన భక్తులు, ప్రజలు,పోలీసు, మున్సిపల్, వైద్య ఆరోగ్య, విద్యుత్ శాఖలఅధికారులు,సిబ్బందికికృతజ్ఞతలు తెలిపారు.

# అగళిలో ఎన్టీఆర్ పెన్షన్ భరోసా పథకంనకు 1077 దరఖాస్తులు

– ఎంపీడీఓ గంగాధర్



**అగళి, సెప్టెంబర్ 19,మనంన్యూస్:** ప్రభుత్వం ఆదేశాలమేరకు అర్హులైన వారి నుండి ఎన్టీఆర్ పెన్షన్ భరోసా పథం ద్వారా అగళి మండలంలో అన్నివిధాలకు చెందిన వారినుశీడి మొత్తం 1077 దరఖాస్తులు వచ్చినట్లుఅగళిఎంపీడీఓ గంగాధర్ తెలిపారు. శని వారం తన కార్యాలయంలో విలేకరులతో అయన మాట్లాడుతూ మండలంలోని 11 గ్రామ పంచాయతీలు కలసి ఎన్టీఆర్ పెన్షన్ భరోసా పథకంనకు మొత్తం 1077మంది లబ్దిదారుల నుండి దరఖాస్తులు వచ్చా యాన్నారు. వాటిలో వృద్ధాప్య 660,డప్పు కళాకారులు 60,వితంతువులు 264, వికలాంగులు 65,ఒంటరి మహిళా 02, తదితరు లకు సంబంధించి 26 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ వివరించారు. వీరికి ఎన్టీఆర్ పెన్షన్ భరోసా పథకం ద్వారా ప్రభుత్వం మంజూరు చేసిన తర్వాత పెన్షన్ నగదు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ గంగాధర్ వెల్లడించారు.ఈ కార్యక్రమంలో డెప్యూటీ ఎంపీడీఓ రెడ్డి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# వర్షం కోసం ప్రత్యేక నమాజ్



**రాయదుర్గం సెప్టెంబర్ 19 మనంన్యూస్** : పట్టణంలోని కణేకల్ రోడ్డులో ఉన్న ఈద్గా మైదానంలో శనివారం ఉదయం వర్షం కోసం ముస్లిం సోదరులు ప్రత్యేక నమాజ్ నిర్వహించారు. ఉదయం 7 గంటలకు నిర్వహి ంచిన ఈ ప్రత్యేక ప్రార్థనకు హాఫీజ్ మహమ్మద్ నసీం జామై నేతృత్వం వహిం చారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక నమాజ్ నిర్వహించి, అనంతరం ప్రసంగించారు.సకాలంలో వర్షాలు కురవకపోవడంతో భూమిపై జీవిస్తున్న మానవులు, పశుపక్ష్యాదులు, ఇతర జీవరాశులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నాయని తెలిపారు. మానవ మనుగడకు, మూగజీవుల జీవనానికి నీరు ఎంతో అవసరమని పేర్కొన్నారు. రైతులు పంటలు పండించేందుకు వర్షమే ప్రధానఆధారమనిఅన్నారు. వర్షాలు సమృద్ధిగా కురిస్తేనే పంటలు పండడంతో పాటు ప్రజలకు, జీవరాశులకు నీటి సమస్య తీరుతుందని వివరించారు.ప్రతి ఒక్కరూ సత్ప్రవర్తనతో మెలగాలని, ఇతరుల పట్ల క్షమాగుణం, జాలి, దయ కలిగి ఉండాలని సూచించారు. భూమిపై నివసించే జీవుల పట్ల మనం కరుణ చూపితే ఆకాశవాసి మనపై కరుణ చూపుతాడని తెలిపారు. అనంతరం నిర్వహించిన ప్రత్యేకప్రార్థనలో మూగజీవులపై దయ చూపి, ప్రజలు, రైతులు, పశుపక్ష్యాదులు సుభిక్షంగాఉండేలా సమృద్ధిగా వర్షాలుకురిపించాలని దైవాన్ని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో పలువురు ముస్లిం సోదరులు పాల్గొన్నారు.



## స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆశీధ్రతో పరిశుభ్రతకు పెద్దపీట

డిడిఓ నరేంద్ర

**ఆమడగూరు సెప్టెంబర్ 19,మనంన్యూస్** : మండలకేంద్రంలోనీ బస్టాండ్. ఆవరణం నుండి స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణ ఆంధ్ర పథకంతో పరి శుభ్రత ప్రభుత్వ పెద్ద పీఠం వేసిందని డిటిఓ నరేంద్ర.తెలిపారు. ఆమడగూరు పంచాయతీ ఆధ్వర్యంలో శనివారం కేంద్రంలోనిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణ ఆశీధ్ర కార్యక్రమంలో ఈ సందర్బంగా ఎంపిడిఓ శకుంతలమ్మ మాట్లాడుతూ పరిశు భ్రత, పచ్చదనం, ప్రజల భాగస్వామ్యంతో అమడగూరు ను మరింత పరిశు భ్రంగాతీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అయన పిలుపునిచ్చారు. మొక్కలునాటి నీరు పోసి పర్యావరణ పరిరక్షణకు పిలుపునిచ్చారు. అనంతరం సిబ్బందికి ప్లాస్టిక్ రహిత బ్యాగులను పంపిణీ చేశారు.పరిశుభ్రమైన లక్ష్యంగా మనమందరం పాటు పడుదామని డిప్యూటీ ఎంపిడిఓ వి ఈ ఆర్ డి ఎంఈఓ ఏపీఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ అధికారులు, సిబ్బంది, నాయకులు, పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.




# అనంతపురం నగరాన్ని మరింత పరిశుభ్రంగా స్వచ్ఛంగా తీర్చిదిద్దుతాం

ఎంపి అంబికా లక్ష్మీనారాయణ



**అనంతపురం సెప్టెంబర్ 19 మనం న్యూస్ :** అనంతపురం నగరాన్ని మరింత పరిశుభ్రంగా, స్వచ్ఛంగా తీర్చిదిద్దే లక్ష్యంతో అనంతపురం కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలో శనివారం చెత్త సేకరణ ఈ-ఆటోల ప్రారంభోత్సవ కార్యక్ర మంలో స్థానిక ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తో కలిసి అనంతపురం పార్లమెంటు సభ్యుడు అం




బికా లక్ష్మీనారాయణ పాల్గొని ఈ-వాహనా లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎం.పి. అంబిక మాట్లాడుతూ ప్రస్తుతం 24 ఈ-ఆటోలను అందుబాటులోకి తీసుకువచ్చాం. త్వరలో అన్ని డివిజన్లలో ఈ సేవలను విస్తరిం చేందుకు చర్యలు తీసుకుంటామని,ప్రతిరోజూ ఎంతో కష్టపడి నగర పరిశుభ్రత కోసం పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులను ఈ సందర్భంగా అభినందించారు. పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. విధి నిర్వహణలో మరణించిన పారిశుద్ధ్య కార్మికుల కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు కల్పించే చర్యలు చేపట్టడం అభినంద నీయం. అదేవిధంగా 60 సంవత్సరాలు పూర్తి చేసుకుని పదవీ విరమణ పొందిన పారిశుద్ధ్య కార్మికుల స్థానాల్లో ఖాళీలను భర్తీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని,ప్రతి ఒక్కరూ చెత్తను రోడ్లపై వేయకుండా ఈ-వాహనాలకు అందించాలి.తడి,పొడి చెత్తను వేర్వేరుగా అందిస్తూ చెత్త నిర్వహణలో సహకరించాలి. ప్లాస్టిక్ వినియో




గాన్ని తగ్గించి, ప్రత్యామ్నాయాలను వినియోగిం చాలని వ్యాపారులు, ప్రజలను కోరుతున్నామ న్నారు.ప్రజలు, అధికారులు, పారిశుధ్య కార్మికులు సమన్వయంతో పనిచేసి స్వచ్ఛ అనంతపురం నిర్మాణంలో భాగస్వాములు కావాలన్నారు.ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ అధికారులు, వివిధ సంస్థల కార్పొరేషన్స్ డైరెక్టర్, చైర్మన్లు, స్థానిక నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు




# త్రాగునీటి సమస్యలపై నేరుగా కలెక్టర్‌కు ఫోన్ చేయండి

ఈ నెల 21న 'డయల్ యువర్ కలెక్టర్'.. ఉదయం 10 నుంచి 10.30 గంటల వరకు

**పుట్టపర్తి, సెప్టెంబర్ 19 మనం న్యూస్ :** జిల్లాలో త్రాగునీటి సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది. ప్రజలు తమ ప్రాంతాల్లో నెలకొన్న త్రాగునీటి సమస్యలను నేరుగా జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ నెల 21వ తేదీ సోమవారం ఉదయం 10 గంటల నుంచి 10.30 గంటల వరకు 'డయల్ యువర్ కలెక్టర్' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డీఆర్వో కొండయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.శ్రీ సత్యసాయి జిల్లాలోని ఏ గ్రామం, మండలం లేదా పరిసర ప్రాంతాల్లో త్రాగునీటికి సంబంధించి సమస్యలు ఉన్నా ప్రజలు నేరుగా 9032020868 నంబర్‌కు ఫోన్ చేసి తమ సమస్యలను తెలియజేయవచ్చని తెలిపారు. నీటి సరఫరా నిలిచిపోవడం, త్రాగునీటి కొరత, ఇతర నీటి సంబంధిత సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ కార్యక్రమం ద్వారా అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.ప్రజల నుంచి అందే ఫిర్యాదులు, సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి వెంటనే తీసుకెళ్లి, అవసరమైన



చర్యలు చేపట్టి సత్వర పరిష్కారం అందించేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని డీఆర్వో తెలిపారు. త్రాగునీటి సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# పిఎం సూర్య ఘర్ యోజన పథకాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి

– ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి : ఏపీఎస్పిడిసిఎల్ ఎస్ఈ శేషాద్రి శేఖర్

**అనంతపురం, సెప్టెంబర్ 19 మనంన్యూస్ :** ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎస్పిడిసిఎల్ ఎస్ఈ శేషాద్రి శేఖర్ పేర్కొన్నారు. శనివారం అనంతపురం నగర పరిధిలోని పంగల్ రోడ్డు లోని అనంత టౌన్షిప్ లో పీఎం సూర్య ఘర్ పథకంపై ప్రజల్లో, వినియోగదారుల్లో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సును నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్పిడిసిఎల్ ఎస్ఈ శేషాద్రి శేఖర్, ఏపీఎస్పిడిసిఎల్ అధికారులు, బ్యాం కర్లు, వెండర్లు, వినియోగదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏపీఎస్పిడిసిఎల్ ఎస్ఈ మాట్లాడుతూ ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకాన్ని ప్రతి



ఒక్కరూ ఉపయోగించుకోవాలన్నారు. ఈనెల 17వ తేదీ నుంచి 19వ తేదీ పీఎం సూర్య ఘర్ పథకంపై అవగాహన సదస్సులు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ పథకానికి 5.75 శాతం వార్షిక వడ్డీతో ఆయా బ్యాంకుల ద్వారా రుణాలు లభిస్తాయని తెలిపారు. జిల్లాలో ఇప్పటికే నమోదైన సౌర ప్యానెల్ విక్రేతలు ఈ సమావేశంలో పాల్గొని మహిళా సంఘాలు వినియోగదారులకు ఈ పథక ప్రయోజనాలను వివరించామన్నారు. ప్రజల్లో అవ గాహన పెంచి ప్యానెల్‌లను ఏర్పాటు చేయడానికి ప్రోత్సహించడం ప్రధాన లక్ష్యం అన్నారు. అలాగే, పీఎం సూర్యఘర్ పథకం ద్వారా జిల్లాలో ఉన్న 42 మంది వెండర్లకు ప్రతి నెల కనీసం 50 యూనిట్ల సౌర ప్యానెల్లు/ఇన్వర్టర్లు ఏర్పాటు చేయడం లక్ష్యంగాఉంచాలని సూచిం చారు. ఈ కార్యక్రమం ద్వారా పన్ను తగ్గింపు వల్ల ప్రజలకు లభించే ఆర్థిక లబ్ధులను పర్యావరణ హితమైన సౌర విద్యుత్ వినియోగ ప్రయోజనాలను వివరించామన్నారు.

# ప్రసాదంపై అసత్య ప్రచారంతో భక్తుల మనోభావాలు దెబ్బతీశారు

– కూటమి నేతలు ప్రజలకు, శ్రీవారి భక్తులకు సమాధానం చెప్పాలి: చెన్నమరెడ్డి గోపాల్‌రెడ్డి

**పెనుకొండ సెప్టెంబర్ 19 మనం న్యూస్ :** కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి ప్రసాదం విషయంలో అసత్య ప్రచారం చేసి కోట్లాది మంది భక్తుల మనోభావాలను దెబ్బతీసిన కూటమి నేతలు ప్రజలకు ఏమి సమాధానం చెబుతారని పెనుకొండ నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షులు చెన్నమరెడ్డి గోపాల్‌రెడ్డి ప్రశ్నించారు.శ్రీవారి ప్రసాదం విషయంలో భక్తుల్లో లేనిపోని అపోహలు సృష్టించి, అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మో హన్‌రెడ్డిపై నిందలు వేయడం తప్ప కూటమి నేతలు చేసిందేమీ లేదని ఆయన విమర్శించారు. ప్రసాదం వ్యవహారంపై తాజాగా వెలుగులోకి వచ్చిన విచారణ, నివేదికల నేపథ్యంలో వాస్తవా లపై రాష్ట్రంలోని విద్యావంతులు, మేధావులు, శ్రీవారి భక్తులు చర్చించుకుంటున్నారని పేర్కొ న్నారు.కోట్లాది మంది భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని ఈ వ్యవహారంపై ప్రజలకు పూర్తి స్పష్టత ఇవ్వాలని, గతంలో చేసిన ఆరోపణలపై సమాధానం చెప్పడంతో పాటు భక్తులకు క్షమాపణలు చెప్పాలని గోపాల్‌రెడ్డి కూటమి నేతలను డిమాండ్ చేశారు.



# ఆర్టిఐ సమాచారాన్ని స్వలాభం కోసం కోరితే అందరికీ ఇక చెంప పెట్టె....



**కుందుర్పి సెప్టెంబర్ 19 మనంన్యూస్ ;** ఆర్టీఐ చట్టం ద్వారా సమాచారాన్ని ఎవరైనా స్వలాభానికి కోసం ఇక వినియోగిస్తే అందరికీ చెంపు పెట్టులాగా చర్యలు ఉంటావని కుందుర్పి మండలం తాసిల్దార్, దాసరి, ఓబులేష్ ఘాటుగా హెచ్చరించారు. శనివారం స్థానిక తాసిల్దార్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ఏపీ సమాచార ప్రధాన కమిషనర్ సబ్బా, శ్రీనివాసరావు, రాష్ట్ర కమిషనర్ గాజుల, ఆదెన్న లు ఉత్తర్వులను తమకు జారీ చేశారన్నారు. ఎపిలోని అంతపురం జిల్లా కళ్యాణదుర్గం తాలూకా లోని మండలంలోని కదరంపల్లి గ్రామం వాసి బి, గోపాల్ ఆర్టిఐ చట్టాన్ని దుర్వినియోగం చేస్తారని ఉద్దేశంతో ఆయన పై వారు సమగ్రంగా విచారణ చేసి ఆధార్ కార్డును రద్దు చేశారని తెలిపారు. భవిష్యత్తులో సమాచారం సేకరించలే తప్ప ఎవరు సమాచారాన్ని దుర్వినియోగం చేయ కూడదన్నారు. ఆయన భవిష్యత్తులో సమాచారం అడగకుండా వీల్లేదు అన్నారు. గోపాల ఇక్కడే కాదు రాష్ట్రంలో సమాచారం మరెక్కడ కోరదానికి వీలులేదని వివరించారు. సమాచారం కేవలం సమాచారం కోరే రీతిలోనే ఉండాలన్నారు. సమాచారం మాటున భక్షించే రీతిలో ఉండరాదని అన్నారు. స్వలాభానికి కోసం ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఆర్టిఐ చట్టాన్ని ఇలా దుర్వినిగం చేస్తే అందరికీ చెంపపెట్టు లాగా చర్యలు తప్పవని ఇలా ఉంటుందని ఆయన ఘాటుగా హెచ్చరించారు. ప్రతి ఒక్కరు సమాచారం కోరే హక్కు కలదని కోరవచ్చు అన్నారు. అయితే వంద దరఖాస్తులు, వెయ్యి దరఖాస్తులు ఉద్యమం అని చెప్పి సమాచార హక్కు చట్టాన్ని నీరుకారుస్తే సహించేది లేదన్నారు.అదే ఉద్దేశంతో 2026 సెప్టెంబర్ 17న కమిషనర్ సంబంధిత పలు శాఖల అధికారులతో వీడియోకాల్‌సమావేశం కమిషనర్ నిర్వహించారు అన్నారు. ఒక వ్యక్తి 300 అర్జీలు ఇవ్వడం ఏమిటని కమిషనర్ అధికారులను ప్రశ్నించారని తెలిపారు. సమాచారం ఇవ్వడం ఆయన స్వలాభం కోసం అధికారులను బెదిరించరని కమిషనర్ కు అధికారులు సమాచారం చేర వేశారన్నారు. తద్వారా జిల్లా అధికారులను కమిషనర్ పూర్తిగా విచారణ చేసి పరిశీలన చేసి ఆయన స్వలాభం కోసం సమాచారం కోసం అధికారులను బెదిరించి

- సమాచారం మాటున ఎవరు ఇక భక్షించ వద్దు
- సమాచారం కోరే హక్కు ప్రతి పౌరుడికి హక్కు కలదు
- ఆర్టిఐ చట్టాన్ని దుర్వినియోగం చేయొద్దు
- వంద, వెయ్యి దరఖాస్తులు ఉద్యమం పేరుతో చట్టాన్ని నీరు కార్చవద్దు
- కదరంపల్లి ,గోపాల్ ఆధార్ కార్డు రద్దు

ధోరణి చేసి అధికారులచే డబ్బులు సేకరించారని కమిషనర్‌కు సమాచారంను పలు శాఖల అధికారులు అందించారన్నారు. ఆర్.టి.ఐ గోపాల్ ఆయనకు ఎవరైతే అధికారులు డబ్బు ఇచ్చారో వారు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారని గుర్తు చేశారు. ఫలితంగా బి, గోపాల్ ఆధార్ కార్డును భవిష్యత్తులో కుందుర్పి స్థాయి నుంచి రాష్ట్రస్థాయి దాకా ఎక్కడ సమాచారం కోరకుండా ఆయన ఆధార్ కార్డును బ్లాక్ చేసినట్టు తాసిల్దారు ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి ,ఇ,లక్ష్మి శంకర్, డిప్యూటీ ఎంపీడీవో, నరసయ్య, డిప్యూటీ తాసిల్దార్ ,ఆర్ ,తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

# పీజీఆర్ఎస్ సమస్యలకు సత్వర పరిష్కారం: తహశీల్దార్ షర్మిల



**పామిడి సెప్టెంబర్ 19 మనంన్యూస్ :** స్థానిక మండల పరిధిలోని ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, పామిడి మండలంలో పీజీఆర్ఎస్ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా అందిన అర్జీలను వేగంగా పరిష్కరిస్తున్నట్లు తహశీల్దార్ షర్మిల తెలిపారు.కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి పామిడి మండలంలో మొత్తం 976 పీజీఆర్ఎస్ అర్జీలు అందగా, వాటిలో 855 అర్జీలను పరిష్కరించినట్లు ఆమె వెల్లడించారు. పరిష్కరించిన అర్జీలలో కొన్నింటిపై ఫిర్యాదుదారులు తిరిగి అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో సుమారు 20 అర్జీలు రీ-ఓపెన్ చేసి పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం మిగిలిన అర్జీలను ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా పరిష్కరించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

# భక్తిశ్రద్ధల మధ్య గణనాథుడికి ఘన వీడ్కోలు

- పోటాపోటీగా సాగిన వేలం...రూ.42,116కు వినాయకుడి లడ్డూ ప్రసాదం
- అంగజాల జగన్‌మోహన్ యాదవ్, అంగజాల జగదీశ్ యాదవ్ సొంతం

**గోరంట్ల, సెప్టెంబర్ 19 మనం న్యూస్ :** వినాయక చవితి సందర్భంగా గ్రామాలు, పట్టణాల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించే గణనాథుడి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. వినాయక విగ్రహ ప్రతిష్ఠ, ప్రత్యేక పూజలు, భజనలు, పాటు లడ్డూ ప్రసాదం వేలం, ఊరేగింపు, నిమజ్జనం వంటి కార్యక్రమాలను భక్తులు ఉత్సాహంగా నిర్వహించారు. పలుచోట్ల లడ్డూ ప్రసాదాన్ని సొంతం చేసుకునేందుకు భక్తులు పోటాపోటీగా వేలంలో పాల్గొని గణనాథుడిపై తమ భక్తిని చాటుకున్నారు.గోరంట్ల మండలం ఎగువ గంగంపల్లి బీసీ కాలనీలో ఏర్పాటు చేసిన వినా



యక విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా చేపట్టారు. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన లడ్డూ వేలం పోటాపోటీగాసాగింది. చివరకు రూ.42,116లకు అంగజాల జగన్‌మోహన్ యాదవ్, అంగజాల జగదీశ్ యాదవ్ లడ్డూ ప్రసాదాన్ని సొంతం చేసుకున్నారు.లడ్డూ వేలం అనంతరం వినాయకుడి విగ్రహాన్ని భక్తులు, యువత, నిర్వాహకులు మేళతాళాల మధ్య ఊరేగింపుగా తీసుకెళ్లారు. భక్తులు గణపతి నామస్మరణ చేస్తూ నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం వినాయక సేవా సమితిసభ్యులు లడ్డూ వేలంలో విజేతలుగా నిలిచిన అంగజాల జగన్‌మోహన్ యాదవ్, అంగజాల జగదీశ్ యాదవ్‌లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాలనీ ప్రజలు, యువత, వినాయక సేవా సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు

# తిక్కస్వామి వీధిలో అన్నదానం



**నార్పల సెప్టెంబర్ 19 మనంన్యూస్ :** స్థానిక మండల కేంద్రంలోని శ్రీ తిక్క స్వామి వీధి వాల్మీకి యువత ఆధ్వర్యంలో నెలకొల్పబడిన వినాయక విగ్రహంవద్ద ఆసిఫ్ అమ్మ (హిజ్రా)ఆశీస్సులతో మధుశ్రీఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమమును నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమ అవకాశాన్ని తమకు కల్పించిన వాల్మీకి యువతకు హిజ్రాలు అభినందనలు తెలిపారు. ఈ అన్నదాన కార్యక్రమానికి గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. రాష్ట్ర ప్రజలకు ఎటువంటి విఘ్నాలు లేకుండా చేయాలని, అలాగే సకాలంలో వర్షాలు కురిపించి రైతులకు పంటలు పండించి సిరిసంపదలు కురిపించాలని, యువత పెడత్రోవ పట్టకుండా మంచి జీవితం వైపు పయనించాలని మొదటి పూజాధిపతి వినాయకుడిని ప్రార్థిస్తున్నామని, ఆ వినాయకుడి ఆశీస్సులు అందరి మీద ఉండాలని అలాగే అందరూ బాగుండాలని అందులో తాము ఉండాలని హిజ్రాలు ఆకాంక్షించారు. ఈ అన్నదాన కార్యక్రమంలో హిజ్రాలు రాజీ, అయేషా, ప్రేమ, అరుణ, శాంభవి, విమల, షాజియా, వాల్మీకి యువత, తిక్కస్వామి వీధి వాల్మీకి పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# హిందూపురం వినాయక నిమజ్జనానికి పటిష్ట బందోబస్తు

సెక్టార్ ఇన్‌చార్జిలకు ఎస్పీ సతీష్‌కుమార్ దిశానిర్దేశం



**హిందూపురం సెప్టెంబర్ 19. (మనంన్యూస్) :** హిందూపురం పట్టణంలో నేడు (సెప్టెంబర్ 20) నిర్వహించనున్న వినాయక నిమజ్జనోత్సవాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ ఎస్. సతీష్‌కుమార్ తెలిపారు. శనివారం సాయంత్రం హిందూపురంలోని ఏఎంఎస్ ఫంక్షన్ హాల్‌లో నిమజ్జన బందోబస్తుకు కేటాయించిన పోలీసు అధికారులు, సెక్టార్ ఇన్‌చార్జిలతో ఎస్పీ సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా శోభాయాత్ర మార్గాలు, ట్రాఫిక్ నియంత్రణ, నిమజ్జన పాయింట్లు, బందోబస్తు విధులు, ప్రజల భద్రత తదితర అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం ఎస్పీ ద్విచక్ర వాహనంపై పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి వినాయక మండపాలు, శోభాయాత్ర మార్గాలు, రద్దీ ప్రాంతాలు, నిమజ్జన పాయింట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.పలు మండపాల వద్ద నిర్వాహకులతో మాట్లాడి పోలీసు శాఖ సూచనలు, నిబంధనలు పాటిస్తూ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా నిర్వహించాలని కోరారు. శోభాయాత్రలో రద్దీని క్రమబద్ధీకరించాలని, ప్రజలు, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన చోట్ల బారికేడ్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. మహిళలు, చిన్నారులు, వృద్ధుల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, అత్యవసర సేవలకు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.అధిక శబ్దం, డీజేలు, రెచ్చగొట్టే నినాదాలకు తావులేకుండా చూడాలని, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. సామాజిక మాధ్యమాల్లో వదంతులు, మత విద్వేషాలను రెచ్చగొట్టే పోస్టులు, వీడియోలు, సందేశాలపైఅప్రమత్తంగా ఉండాలని సూచిం



చారు.వినాయక నిమజ్జన బందోబస్తు కోసం డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు సహా మొత్తం 1,000 మంది పోలీసు అధికారులు, సిబ్బందిని కేటాయించినట్లు ఎస్పీ తెలిపారు. నిమజ్జనోత్సవాన్ని భక్తి, క్రమశిక్షణతో ప్రశాంతంగా నిర్వహించేందుకు నిర్వాహకులు, ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని కోరారు.ఈ సమావేశంలో అదనపు ఎస్పీ కె.వి. మహేష్, డీఎస్పీ శివ నారాయణస్వామి, సీఐలు అబ్దుల్ కరీం, ఆంజనేయులు, జనార్దన్, ప్రసాద్‌బాబు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్రతో పరిశుభ్రతకు పెద్దపీట

ఎంపిడిఓ ప్రభాకర్



**పామిడి , సెప్టెంబర్ 19,మనంన్యూస్ :** స్థానిక మండల పరిధిలోని ఆర్టీసీ బస్సు స్టాండ్ ఆవరణం నుండి స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణ ఆంధ్ర పథకంతో పరిశుభ్రత ప్రభుత్వ పెద్ద పీఠం వేసిందని డిప్యూటీ ఎంపిడిఓ అస్వర్థమ నాయుడు తెలిపారు.పామిడిపంచాయతీ ఆధ్వర్యంలోశనివారం పట్టణంలో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలోఈ సందర్భంగా ఎంపిడిఓ ప్రభాకర్ మాట్లాడుతూ పరిశుభ్రత, పచ్చదనం, ప్రజల భాగస్వామ్యంతో పామిడిను మరింత పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అయన పిలుపునిచ్చారు. మొక్కలు నాటి నీరు పోసి పర్యావరణ పరిరక్షణకు పిలుపు నిచ్చారు. అనంతరం సిబ్బందికి ప్లాస్టిక్ రహిత బ్యాగులను పంపిణీ చేశారు. పరిశుభ్రమైన లక్ష్యంగా మనమందరం పాటు పడుదామని డిప్యూటీ ఎంపిడిఓ అస్వర్థమ నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ అధికారులు, సిబ్బంది,నాయకులు, పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



## క్షేత్రస్థాయిలో ఎండిపోయిన పంటలను పరిశీలించిన వైసీపీ సమన్వయకర్త డాక్టర్ శైలజనాథ్





**శింగనమల సెప్టెంబర్ 19 మనంన్యూస్ :** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు శింగనమల నియోజకవర్గంలో మాజీ మంత్రి, నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సాకే శైలజనాథ్ మరియు రాష్ట్ర రైతు విభాగ జనరల్ సెక్రటరీ బొమ్మన శ్రీరాంరెడ్డి నేతృత్వంలో పంట పొలాల పరిశీలన కార్యక్రమం కొనసాగింది. శింగనమల మండలం నాగులగుడ్డం నుంచి ఈస్ట్ నరసాపురం వరకు సాగునీరు అందక నిలువునా ఎండిపోతున్న పంట పొలాలను శైలజనాథ్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. నేరుగా పొలాల్లోకి వెళ్లి ఎండిపోయిన పైర్లను చేతిలోకి తీసుకుని, రైతుల కష్టాలను,వారి ఆవేదనను అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సాకే శైలజనాథ్ మాటా ్లడుతూ "రైతు కళ్లముందే పంట ఎండిపో తుంటే.. ఆ రైతు గుండె ఎంతగా మండుతుందో ఈ పొలా ల్లోకి వస్తే తెలుస్తుంది. నెలల తరబడి కష్టపడి, అప్పులు చేసి సాగు చేసిన పంటకు నీళ్లు అందక పోవడం రైతుదురదృష్టంకాదు.. ప్రభుత్వ వైఫల్యం. సాగునీటి నిర్వహణలో ముందుచూపు లేకపోవడం, అవసరమైన సమయంలో నీటిని అందించకపోవ డం వల్ల వేలాది ఎకరాల్లో పంటలు నిలువునా ఎండిపోతున్నాయి. పంట చేతికం దాల్సిన సమ యంలోరైతుచేతిలోమిగిలింది ఎండిపోయిన పైరు.. అప్పుల భారం.. కన్నీళ్లే.రైతు పొలంలో నిలబడి పరిస్థితిని చూసే ప్రభుత్వం కావాలి.. కార్యాలయా ల్లో కూర్చొని లెక్కలు చెప్పే ప్రభుత్వం కాదుకరువు పరిస్థితులు తీవ్రంగా ఉన్న ఈ సమయంలో ప్రభు త్వం వెంటనే క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితిని అంచనావేయాలి.సాగునీటి సమస్యకుతక్షణ పరిష్కా రం చూపడంతో పాటు, పంట నష్టపోయిన రైతు లను ఆదుకునేందుకు తగిన పరిహారం అందిం చాలి.రైతు కన్నీరు తుడిచే వరకు..రైతుహక్కుల కోసం వైఎస్సార్‌సీపీ పోరాటం కొనసాగుతుంది ఈ వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు

### చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించిన న్యాయమూర్తి, పోలీసులు



**కళ్యాణదుర్గం సెప్టెంబర్ 19 మనం న్యూస్ :** స్థానిక ఎస్వీజీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్), మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు శనివారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. హర్షలత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు వివిధ చట్టాలు, హక్కులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ పి. హర్షలత మాట్లాడుతూ బాలికల సంరక్షణ, పనిచేసే ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం, బాల్యవివాహాల నిరోధక చట్టాలపై వివరిం చారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన న్యాయ విజ్ఞాన కమిటీ గౌరవ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి కె. భాను మాట్లాడుతూ విద్యార్థులకు ప్రాథమిక హక్కులు, విధులు, గృహహింస నిరోధక చట్టంతదితర అంశాలను వివరించారు. సమస్యలు ఎదురైనప్పుడు చట్టాలపై నమ్మకంతో సరైన న్యాయ సహాయం ఎలా పొందాలో తెలియజేశారు. విద్యా ర్థులు చదువుపై నమ్మకంతో లక్ష్యసాధన దిశగా ముందుకు సాగాలని, ఇందుకు సంబంధించిన అంశాలను పలు ఉదాహరణలతో వివరించారు. స్థానిక పట్టణ సీఐ వి. హరినాథ్ మాట్లాడుతూ నేటి యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. రహదారి భద్రత, మహిళల రక్షణకు ఉపయోగపడే శక్తి యాప్, ఈవ్‌టీజింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. న్యాయవా దులు దాదా కలందర్, పట్టాభి, దిలీప్, మంజు నాథ్ మాట్లాడుతూ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎదురయ్యే కష్టనష్టాలను వివరించారు. సమాచార హక్కు చట్టం, వినియోగదారుల హక్కు లచట్టంతదితరచట్టాలపై అవగాహన పెంచు కోవా లని సూచించారు. చట్టాలపై మాత్రమే కాకుండా సమాజం పట్ల బాధ్యతతో వ్యవహరిస్తూ, తమ జీవన విధానంలోని లోపాలను సైతం సరి దిద్దు కోవాలనిపిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ఎస్అధికారి డాక్టర్ కె.శ్రీధర్,మహిళా సాధికా రత విభాగం సమన్వయకర్త డాక్టర్ జి. మాధవీలత ,అధ్యాపకులు అమృతలక్ష్మి, సౌగాంధిక, కలిముల్లా, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ పాము కాటు అవగాహన దినోత్సవం



**గాండ్లపెంట సెప్టెంబర్ 19 మనంన్యూస్:** మండల కేంద్రంలోని కల్లుబావి తండాలో అంతర్జాతీయ పాముకాటు అవగాహన దినోత్సవం సందర్భముగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం గాండ్లపెంట పరిధి లోని కల్లుబావి తాండ నందు సామజిక ఆరోగ్య అధికారి నగేష్ పాము కాటుపై అవగాహన కల్పించుచు పాము కాటు నుండి రక్షణ, నివారణ భద్రత ముందు జాగ్రత్తలు తెలియపరచుచు పాము కాటుకు గురయ్యే ఎక్కువ అవకాశం ఉన్న వ్యక్తులు రైతులు, కూలీలు, నిర్మాణ కార్మికులు,పిల్లలు,అడవి వన్యప్రాణి కార్మికులు అని తెలియపరచారు. ప్రమాధ సూచ నలుగా చిగుళ్ళు, ముక్కు మరియు ఇతర భాగాలనుండి రక్తస్రావం,రెండు కనురప్పలు వాలి పోవడము,శ్వాస తీసుకోవడం కష్టంగా ఉండడము లాంటివి ఉండునని, బాధితుని సాధారణ స్థితిలో ఉంచాలని,బిగుతుగా ఉండే దుస్తులను వదులుగా ఉంచాలని,ఉంగరాలు, గాజులను, గడియారాల నను తీసివేయాలని,కాటు వేసిన భాగాన్ని కదల కుండాఉంచాలని, తగిన ధైర్యం చెప్పాలని వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లాలని తెలియపరచి గాయాన్ని కోయవద్దని, విషాన్ని పీల్చ వద్దని, స్వంత వైద్యము చేయవద్దని తెలియపరచడమైనది. వ్యాధి నిరోదక టీకాలు, డ్రైడే ఫ్రైడే, వివాహ వయస్సు, కుష్టు వ్యాధిపైఅవగాహనకల్పించి అంగనవాడి కేంద్రము నందు గర్భవతులకు, బాలింతలకు, చిన్నపిల్లలకు అందించు పౌష్టికా హారము తెలియపరచదమైనది. మరియు ఈ కార్యక్రమములో సూపర్ వైజర్ ఉపేంద్రరెడ్డి,ఆరోగ్యకార్యకర్తలుయం. శ్రీనివాసులు రెడ్డి, భవానీ ఆశా కార్యకర్త లక్ష్మీదేవి, అంగనవాడి టీచర్ పార్వతమ్మ, ఆయా నరసమ్మ పాల్గొన్నారు

## వేమన గడపలోని సేవను గుర్తించిన ఏడిటీ



**గాండ్లపెంట సెప్టెంబర్ 19 మనంన్యూస్:** మండల కేంద్రంలోని కటారుపల్లి గ్రామంలో ఆదరణ డెవలప్‌మెంట్ ట్రస్ట్(ఏ డి టి) ఆధ్వర్యంలో యోగి వేమన ఆలయ పీఠాధిపతి నంద వేమా రెడ్డిని సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆదరణ డెవలప్మెంట్ ట్రస్ట్ ఎండి నాగేష్ చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ జానకిరామ్ విద్యాసంస్కార కేంద్ర ఉపాధ్యాయులు గంగాధర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదు రోజులు పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించి వర్షాలు కురవాలని యజ్ఞాలు, హోమాలు చేయించి మన ప్రాంతం సుభిక్షంగా ఉండాలని సంకల్పంతో ముందడుగు వేసిన వేమన ఆలయ పీఠాధిపతి నంద వేమారెడ్డిని సత్కరించడం అభినందనీయమని పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆదరణ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఏడిటి) ఎం.డి. మద్దిమడుగు నాగేష్ , చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ రెడ్లపల్లి జానకిరామ్, ఉపాధ్యాయులు గంగాధర్, సభ్యులు వేమా ప్రసాద్, నాగార్జున, పాల్గొన్నారు. వినాయక చవితి పండుగను 5రోజులపాటు 22 మంది అర్చకులతో వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించినం దుకు నంద వేమా రెడ్డిని ఏడిటిఎం.డి. మద్దిమ డుగునాగేష్అభినందించారు. ఈసందర్భంగా నంద వేమా రెడ్డిని సత్కరించి, ఆయన చేస్తున్న ఆధ్యాత్మిక మరియు సామాజిక సేవలను కొనియాడారు.

# మతసామరస్యానికి పెద్దపీట



**హిందూపురం సెప్టెంబర్ 19 (మనంన్యూస్) :** ఆకలితో, భక్తిభావంతో వచ్చిన ప్రతి ఒక్కరికీ కులం, మతం ప్రాంతం, పార్టీ అనే బేధభావం లేకుండా భోజనం అందించడం ఈ సేవా కార్యక్రమానికి హాట్సాఫ్ అని భక్తాదులు చర్చించుకుంటున్నారు. ఆకలికి, భక్తికి, కులం, మతం, ప్రాంతం, బాషా, పార్టీ అనే బేధభావం లేదనేది స్పష్టంగా కనిపిస్తోందని భక్తాదులు భావిస్తున్నారు. హిందూపురంలో మతసామరాస్యానికి పెద్దపీట వేస్తున్నారనేది ఇందుకు ఉదాహరణగా చెప్పవచ్చని పట్టణ ప్రజలు చర్చించుకుంటున్నారు. పూర్తీ వివరాలకి వెళ్తే పవిత్రమైన శుక్రవారం రోజు స్థానిక పట్టణం త్యాగరాజు నగర్ ఆటో స్టాండ్ లో నెలకొల్పిన శ్రీ విశ్వసేన వినాయక సేవా సమితి ఆధ్వర్యంలో వారంరోజులనుండి గణపతికి విశేష పూజలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇదే ప్రాంతంలో ఉన్న మైనారిటీ నాయకులు సమివుల్లా,శాంతనగర్ భాష, వీరి స్నేహితులు హోమియోపతి వైద్యులు చల్లాపల్లి రవీంద్రరెడ్డి భక్తాదులకు త్రాగునీరు, అన్నదాన ప్రసాదాల కార్యక్రమాల్లో పాల్గొని అన్న ప్రసాదాల పంపిణీ తమ స్వహస్తాలతో భక్తులకు అందించారు. ఇందుకు కమిటీ సభ్యులు దాతలు సమీవుల్లా, శాంతినగర్ భాషలకు ధన్యవాదాలు తెలిపారు.

## వినాయక నిమర్జనంకు అన్ని ఏర్పాట్లు పూర్తి



### మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున

**హిందూపురం సెప్టెంబర్ 19 (మనంన్యూస్) :** స్థానికపట్టణంలో అంగరంగ వైభవంగా నిర్వహించనున్న వినాయక ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు హిం దూపురం మున్సిపల్ కమిషనర్ మల్లికా ర్జున తెలిపారు. విలేకరుల సమా వేశంలో ఆయన ఉత్సవాల ఏర్పాట్ల వివరాలను వెల్లడిం చారు. పట్టణంలోని ప్రధాన రహ దారుల్లోట్రీకటింగ్,స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు, గుడ్డం కోనేరు వద్ద నీటి సదుపాయం కల్పించడంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, లైటింగ్ తదితర వివిధ ఏర్పాట్లను పూర్తి చేసినట్లు కమిషనర్ తెలిపారు. వినాయక నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, సజావుగా జరిగేం దుకు మండపాల నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులు అధికారులతో సమన్వయం చేసుకుని సహకరించాలని ఆయన కోరారు. నిమజ్జన సమయంలో అధికారులు సూచించే నిబంధనలు, మార్గదర్శకాలను ప్రతి ఒక్కరూ పాటించాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున సూచించారు.

## వేమన పీఠాధిపతి శ్రీ నంద వేమారెడ్డికి ఘన సన్మానం

**గాండ్లపెంట సెప్టెంబర్ 19 మనంన్యూస్ :** మండల కేంద్రంలోని కటారు పల్లిలోవేమన ఆలయపీఠాధిపతి తుంగ నందవేమారెడ్డి ఘనంగా నిర్వహించిన వినాయక చవితిఉత్సవాల్లో కదిరినియోజకవర్గ వైసిపి సమన్వ యకర్త బి.ఎస్. మక్బూల్ పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఉత్సవాల నిర్వహణనుఅభినందిస్తూ, "వినాయకచవితి వేడుకలను చాలా బ్రహ్మాండంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు" అని మక్బూల్ అన్నారు. భక్తి, ఐక్యత, సంప్రదా యాలకు ప్రతీకగాకటారుపల్లిలో నిర్వహించిన ఈవేడుకలుఅందరినీ ఆకట్టు కున్నాయి. ఈకార్యక్రమాన్నివిజయవంతంగానిర్వహించిననంద వేమారెడ్డి కి, నిర్వాహకులకు, గ్రామ ప్రజలకు మక్బూల్ అభినందనలు తెలిపారు.



# జీరో వ్యాపారం జోరు...! బిల్లుల్లేని లావాదేవీలపై ఆరోపణలు

**– బిల్లు అడిగితే.. జీఎస్టీ సాకు.?**
**– వేకువజామున అన్‌లోడింగ్..**
**– సాయంత్రం అధిక లోడుతో వాహనాల సందడి**
**– కొనుగోలు.. స్టాక్.. విక్రయం.. లెక్క తేల్చాల్సిందే!"**
**–అధికారుల ఆకస్మిక తనిఖీలకు ప్రజల డిమాండ్**

**గోరంట్ల సెప్టెంబర్ 19 మనం న్యూస్ :** జీఎస్టీ వచ్చింది.. పన్నుల వ్యవస్థలో పారదర్శకత పెరిగింది.. ప్రతి వ్యాపార లావాదేవీకి లెక్క ఉండాలి.. కొనుగోలుదారుడికి బిల్లు ఇవ్వాలి.. ప్రభుత్వం చెబుతున్న విధానం ఇదే. కానీ గోరంట్ల మరియు పట్టణ పరిధిలో క్షేత్రస్థాయిలో పరిస్థితి పూర్తిగా అలాగే ఉందా? అన్న ప్రశ్నలు ప్రజల్లో వినిపిస్తున్నాయి. సిమెంటు, ఇనుము, నిర్మాణ సామగ్రి దుకాణాల నుంచి కిరాణా షాపులు, సూపర్‌మార్కెట్ల వరకు బిల్లింగ్ వ్యవహారంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సిమెంటు, ఇనుము, నిర్మాణ సామగ్రి వంటి అధిక విలువ కలిగిన వస్తువుల విక్రయాల్లో ప్రతి లావాదేవీకి సరైన బిల్లులు జారీ అవుతున్నాయా? కిరాణా, నిత్యావసర వస్తువుల విక్రయాల్లోనూ కొనుగోలుదారులకు బిల్లులు ఇస్తున్నారా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. బిల్లు అడిగితే 'జీఎస్టీ పడుతుంది', 'బిల్లుతో ధర పెరుగుతుంది' అంటూ వివిధ కారణాలు చెబుతూ బిల్లు ఇవ్వకుండా విక్రయాలు సాగిస్తున్నారన్న ఆరోపణలు కొందరు వినియోగదారుల నుంచి వస్తున్నాయి.
ఇదే సమయంలో విక్రయదారులు సరుకు కొనుగోలు చేయకపోయినా డబ్బులు చెల్లిస్తే జీఎస్టీ బిల్లు ఇచ్చేస్తున్నారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. వాస్తవంగా సరుకు కొనుగోలు జరిగిందా? బిల్లులో




చూపించిన సరుకు స్టాక్‌లో ఉందా? కొనుగోలు, విక్రయ లావాదేవీలకు సరైన ఆధారాలు ఉన్నాయా? అన్నది అధికారుల తనిఖీల్లో తేలాల్సిన అంశంగా మారింది. కేవలం బిల్లుల జారీతోనే లావాదేవీ పూర్తయినట్లు భావించకుండా, బిల్లుకు సంబంధించిన సరుకు, స్టాక్, కొనుగోలు రికార్డులు, విక్రయ వివరాలను కూడా పరిశీలించాల్సిన అవసరం ఉందని ప్రజలు అంటున్నారు.
మరోవైపు వ్యాపార లావాదేవీలపై ఎవరైనా ప్రశ్నించినప్పుడు 'వర్షాలు లేవు.. వ్యాపారాలు లేవు' అంటూ విషయాన్ని దాటవేసేలా సమాధానాలు ఇస్తున్నారన్న చర్చ కూడా స్థానికంగా వినిపిస్తోంది. వ్యాపారం లేదని చెబుతున్నప్పుడు పెద్ద మొత్తంలో సరుకుల రాకపోకలు ఎలా జరుగుతున్నాయి? వాహనాల్లో సరుకులు ఎక్కడి నుంచి వస్తున్నాయి? విక్రయాలు, స్టాక్, బిల్లింగ్ లెక్కలు ఏమిటి? అన్నది అధికారుల పరిశీలనతో స్పష్టమవ్వాల్సి ఉందని ప్రజలు కోరుతున్నారు.పట్టణంలోని కొన్ని సూపర్‌మార్కెట్లు, కిరాణా దుకాణాలకు సరుకుల రాకపోకలపైనా చర్చ జరుగుతోంది. పెద్ద నగరాల్లోని ప్రముఖ మార్కెట్లు, సూపర్‌మార్కెట్ల నుంచి సరుకులను కొనుగోలు చేసి సొంత వాహనాల్లో తీసుకొస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అనంతరం స్థానికంగా వాటిని తిరిగి ప్యాకింగ్ చేయడం, సొంత లేబుళ్లు వేయడం, కొలతలు, తూకాలు వేసి విక్రయిస్తున్నారన్న ఫిర్యాదులు ఉన్నాయి. ఈ ఆరోపణల్లో వాస్తవమెంత? సరుకుల కొనుగోలుకు అసలు బిల్లులు ఉన్నాయా? స్టాక్ రికార్డుల్లో నమోదవుతున్నాయా? అన్నది అధికారుల తనిఖీల్లో తేలాల్సి ఉంది. వేకువజామునే కొన్ని వాహనాల్లో సరుకులను తీసుకొచ్చి గుట్టుచప్పుడు కాకుండా అన్‌లోడింగ్ చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సాయంత్రం సమయాల్లో పట్టణంలో టాటా ఏసీలు, బొలెరోలు, 407 వాహనాలు, ఇతర సరుకు రవాణా వాహనాల రాకపోకలు పెరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఈ వాహనాల్లో ఏ సరుకులు వస్తున్నాయి? ఎక్కడి నుంచి వస్తున్నాయి? వాటికి సంబంధించిన కొనుగోలు బిల్లులు ఉన్నాయా? అన్‌లోడ్ చేసిన సరుకు స్టాక్‌లో నమోదు అవుతోందా? అన్న అంశాలను అధికారులు పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు.సూపర్‌మార్కెట్లు, కిరాణా దుకాణాలు, ప్యాకేజ్డ్ వస్తువుల విక్రయ కేంద్రాల్లో కొనుగోలు బిల్లులు,స్టాక్,విక్రయ బిల్లులు,తూకం,లేబులింగ్,ధర మధ్య సంబంధాన్ని అధికారులు పరిశీలించాలని





ప్రజలు కోరుతున్నారు. సరుకులు బయట తక్కువ ధరకు కొనుగోలు చేసి స్థానికంగా ప్యాకింగ్ మార్చడం లేదా కొలతలు వేయడం జరుగుతున్నట్లయితే కొనుగోలు ధర, ప్యాకింగ్ పరిమాణం, విక్రయ ధర మధ్య వ్యత్యాసం ఎంత? వినియోగదారుడికి సరైన వివరాలు అందుతున్నాయా? తూకాల్లో తేడాలు ఉన్నాయా? వంటి అంశాలపైనా స్పష్టత రావాల్సి ఉంది.జీఎస్టీ వర్తించే లావాదేవీల్లో పన్ను లెక్కలు సక్రమంగా చూపుతున్నారా? విక్రయాలకు తగిన బిల్లులు జారీ చేస్తున్నారా? అన్నది కూడా తనిఖీల్లో తేలాల్సి ఉంది. జీఎస్టీ వ్యవస్థ అమలులోకి వచ్చి సంవత్సరాలు గడుస్తున్నా వ్యాపార సంస్థలపై క్రమం తప్పకుండా తనిఖీలు జరుగుతున్న దాఖలాలు పెద్దగా కనిపించడం లేదని కొందరు ప్రజలు విమర్శిస్తున్నారు. నిబంధనలకు అనుగుణంగా వ్యాపారం చేస్తున్న వారిని ఇబ్బంది పెట్టకుండా, అక్రమాలకు పాల్పడుతున్నట్లు తేలిన వారిపై మాత్రమే చట్టపరమైన చర్యలు తీసుకునేలా పారదర్శకమైన తనిఖీ వ్యవస్థ ఉండాలని కోరుతున్నారు.జీఎస్టీ వ్యవస్థ ప్రధాన ఉద్దేశం వ్యాపార లావాదేవీలను పద్ధతిలోకి తీసుకురావడం, పన్ను ఎగవేతను అరికట్టడం, ప్రభుత్వ ఆదాయాన్ని కాపాడటం, వినియోగదారుడికి లావాదేవీకి ఆధారం కల్పించడం. బిల్లులు లేకుండా లేదా



లెక్కల్లోకి రాని విధంగా విక్రయాలు జరిగితే ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలగడమే కాకుండా వినియోగదారుడికి తాను కొనుగోలు చేసిన సరుకుకు సరైన ఆధారం లేకుండా పోయే అవకాశం ఉంది.

## పత్తి పంటను పరిశీలించిన జిల్లా వ్యవసాయ అధికారి

**పెద్దవడుగూరు సెప్టెంబర్ 19 మనం న్యూస్.** మండల పరిధిలోని లక్ష్యం పల్లి గ్రామంలో శనివారం గ్రామానికి చెందిన ఓబులేసు రైతుకు చెందిన హైడెన్సిటీ ప్లాంటింగ్ సిస్టం పత్తి పంటను జిల్లా. వ్యవసాయ అధికారి సాల్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి రైతులతో మాట్లాడుతూ. పత్తి పంటలో సాగు చేసే



రైతులకు పాటించాల్సిన మెలకువలను రైతులకు వివరిస్తూ సకాలంలో పంటకు పురుగుల మందు ఎరువులు క్రమం తప్పకుండా పిచికారి చేస్తూ వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ. పంటలు సాగు చేసినట్లయితే. ఆశించిన స్థాయిలో. రైతులకు మంచి దిగుబడి లభిస్తుందని. పత్తి పంటపై రైతులు అవగాహన పెంపొందించుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గుత్తి డివిజన్ ఏడిఏ వెంకటరాముడు పెద్దవడుగూరు మండల వ్యవసాయ అధికారి మునికృష్ణ ఏ ఈ ఓ లు భగవాన్ సునీత అలాగే రైతు సేవా కేంద్రం సిబ్బంది మానస మురళి శిరీష లక్ష్మీనారాయణ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## కరువును జాతీయ విపత్తుగా ప్రకటించాలి

**సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున**

**కళ్యాణదుర్గం సెప్టెంబర్ 19 మనం న్యూస్ :** కరువు పై రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ సెప్టెంబర్ 21, 22, 23 తేదీలలో మండల కేంద్రాలలో సిపిఐ ఆధ్వర్యంలో కరువు దీక్షలు చేపడతామని, కరువు సహాయక చర్యలు చేపట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైనది అని, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున విమర్శించారు. శనివారం




పట్టణం లోని సిపిఐ ఆఫీసులో రాంబాబు అధ్యక్షతన జరిగిన సిపిఐ నియోజకవర్గ ముఖ్యుల సమావేశం లో నియోజకవర్గ కార్యదర్శి గోపాల్ సహాయ కార్యదర్శి నరసింహులు తో కలిసి ఆయన మాట్లాడారు. జిల్లాలో అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి, కరువును జాతీయ విపత్తుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. రైతుల అన్ని రకాల బ్యాంకు రుణాలను రద్దు చేయాలని, పశువులకు పశుగ్రాస కేంద్రాలు ఏర్పాటు చేయాలని, పంట నష్ట పరిహారం ఇవ్వడంతో పాటు పంటలు బీమా అములు చేయాలని, గ్రామీణ ప్రాంత కూలీలకు షరతులు లేకుండా ఉపాధి హామీ పని కల్పించాలని, కరువు ప్రాంత విద్యార్థుల అన్ని రకాల ఫీజులు రద్దు చేయాలని, చిన్న సన్న కారు రైతులకు కూలీలకు కరువు పెన్షన్ ఇవ్వాలని, ప్రతి గ్రామంలోనూ ఉచిత త్రాగునీటి సౌకర్యం కల్పించాలని, పశువులు, గొర్రెలు మొదలగు మూగజీవాలకు త్రాగునీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ కలిసి వచ్చే ప్రతిపక్ష పార్టీలను కలుపుకొని ఈనెల 21, 22, 23 తేదీలలో అన్ని మండల కేంద్రాలలో సిపిఐ ఆధ్వర్యంలో కరువు దీక్షలు నిర్వహిస్తామని వారు తెలియజేశారు.



## అంగన్వాడీ కేంద్రం తనిఖీ

**శింగనమల సెప్టెంబర్ 19 మనం న్యూస్**
మండల పరిధిలోని ఆకులేడు గ్రామంలో ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని ఐసిడిఎస్ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎస్.శజీదాబేగం శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా శజీదాబేగం మాట్లాడుతూ తల్లులు, చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదల, మానసిక, శారీరక, సామాజిక అభివృద్ధికి ప్రీస్కూల్ విద్య ఎంతో అవసరమన్నారు. కావున మూడు నుంచి ఆరేళ్లలోపు పిల్లలను రోజూ అంగన్వాడీ కేంద్రాలకు పంపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఒ చల్లా లలితమ్మ, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ కల్పన, వాణిశ్రీ, అంగన్వాడీ కార్యకర్త వనిత, ప్రైమరీ స్కూల్ ఉపాధ్యాయులు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, గర్భిణులు, బాలింతలు, పిల్లలు పాల్గొన్నారు.

## రేడియాలజీ పాత్రపై విద్యార్థులకు అవగాహన

**గుంతకల్లు, సెప్టెంబర్ 19 మనం న్యూస్ :** ఎస్ కె పి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వైద్యరంగంలో నిర్వహించు అత్యాధునిక వైద్య పరీక్షలలో రేడియాలజీ యొక్క పాత్రను ప్రముఖ రేడియాలజిస్ట్ డాక్టర్ హర్షద్ విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా ఎక్స్ రే,సిటీ స్కానింగ్ ఎమ్మారై వంటి పరీక్షలను ఏ పద్ధతిలో నిర్వహిస్తారు, రోగ నిర్ధారణ ఎలా నిర్వహిస్తారు అన్న అంశాలను వివరిస్తూ రోగ నివారణకు ఎటువంటి ఆహారపు అలవాట్లు అలవర్చుకోవాలని, కాలుష్యానికి దూరంగా ఉండి మంచి ఆరోగ్యాన్ని పొందాలని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమం ఎస్ కె పీ కళాశాల పరిశోధన విభాగం ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ లక్ష్మయ్య , పరిశోధన విభాగం అధిపతి డాక్టర్ సి మాధవి , ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ కె హనుమంత్ రెడ్డి , ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ రవి శంకర్ ఇతర అధ్యాపక బృందం విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నియోజకవర్గ అభివృద్ధి మా లక్ష్యం

**- గుమ్మనూరు నారాయణస్వామి**



**గుంతకల్లు ,సెప్టెంబర్ 19 మనం న్యూస్ :** గుంతకల్ నియోజకవర్గం అభివృద్ధి మా లక్ష్యం అని గుంతకల్ నియోజకవర్గం టిడిపి ఇన్చార్జ్ గుమ్మనూరు నారాయణస్వామి పేర్కొన్నారు. శనివారం 15వ ఆర్థిక సంఘం నిధులతో పట్టణంలోని వివిధ కాలనీలో 40 లక్షల అభివృద్ధి పనులకు ఆయన భూమి పూజ చేశారు. భీమిలింగేశ్వర కాలనీలో పది లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి 22 లక్షలతో త్రాగునీటి పైపులు పనులకు ఆయన భూమి పూజ చేశారు. అదేవిధంగా పోర్టల్ లైన్ లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద 10 లక్షల తో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు ఈ సందర్భంగా గుమ్మనూరు నారాయణస్వామి మాట్లాడుతూ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఆదేశాల మేరకు పట్టణం నుండి ప్రతి వార్డులో శుభోదయం కార్యక్రమం నిర్వహించి దాని ద్వారా ప్రజల నుంచి వచ్చే సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి శ్రీకారం చుడుతున్నామన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల తుది పోలింగ్ సెంటర్ల జాబితా ప్రచురణ



**హిందూపురం (మనం న్యూస్) సెప్టెంబర్ 19.** మండలంలో స్థానిక సంస్థల ఎన్నికలు -- 2026 కు సంబంధించి తుది పోలింగ్ స్టేషన్ల జాబితా ప్రచురించబడిందని ఎంపిడిఓ దామోదరమ్మ శనివారం పేర్కొన్నారు.మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల నోటీసు బోర్డులపై తుది పోలింగ్ స్టేషన్ల జాబితాను ప్రజల పరిశీలనార్థం ప్రచురించడం జరిగిందన్నారు.ప్రజలు తమ గ్రామానికి సంబంధించిన పోలింగ్ స్టేషన్ పేరు, పోలింగ్ స్టేషన్ స్థానం మరియు ఇతర వివరాలను సంబంధిత గ్రామ పంచాయతీ కార్యాలయాల నోటీసు బోర్డులపై పరిశీలించవచ్చని మండల పరిషత్ అభివృద్ధి అధికారి దామోదరమ్మ పేర్కొన్నారు.

## గ్రామ పారిశుద్ధ్యంలో ప్రజలు భాగస్వాములు కావాలి

**నార్పల: సెప్టెంబర్ 19 మనం న్యూస్ :** మన గ్రామాన్ని పారిశుద్ధ్య గ్రామంగా మార్పు చేసుకోవడానికి ప్రజలంతా భాగస్వాములు కావాలని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు కోరారు. పారిశుద్ధ్యంతోపాటు గ్రామంలో పచ్చదనాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం కూడా ఉందన్నారు. పారిశుద్ధ్యం, నీటి సంరక్షణ, పచ్చదనం పరిరక్షణతోనే ఆరోగ్యంగా జీవించగలమని మరియు పర్యావరణాన్ని కాపాడుకుంటే మానవాళి మనుగడ



సాధ్యమవుతుందన్నారు. ప్రకృతి విపత్తుల నుండి సురక్షితంగా ఉందామని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్లాస్టిక్‌ను నివారిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం

**– ప్లాస్టిక్ వద్దు-ప్యాపర్ బ్యాగులే ముద్దు**
**– కార్యక్రమంలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్**

**కదిరి, సెప్టెంబర్ 19మనంన్యూస్:** "ప్లాస్టిక్ వద్దు.. పేపర్ బ్యాగ్‌లు ముద్దు" అనే నినాదంతో ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ పిలుపునిచ్చారు. కదిరి పట్టణంలోని గర్ల్స్ హైస్కూల్ ఎదురుగా నిర్వహించిన స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి కలుగుతున్న నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎమ్మెల్యే తెలిపారు. ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని తగ్గించి, వాటికి ప్రత్యామ్నాయంగా పేపర్ బ్యాగ్‌లు, పర్యావరణహిత వస్తువులను వినియోగించాలని సూచించారు. "మన ఆరోగ్యం.. మన పర్యావరణం.. మన బాధ్యత" అనే స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ స్వచ్ఛత కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని కోరారు. కదిరి పట్టణాన్ని పరిశుభ్రంగా, స్వచ్ఛంగా ఉంచేందుకు ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. స్వచ్ఛమైన కదిరి.. ఆరోగ్యకరమైన కదిరి కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలి అని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ అజయ్ కుమార్, స్వచ్ఛాంధ్ర మహిళా కమిషన్ సభ్యురాలు పర్వీన్ భాను, పట్టణ టీడీపీ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.








# ఖామ్రుద్దీన్ పై బాధ్యతలు ఫిర్యాదు

**– అతని ఆచూకీ తెలిపి మా నగదు మాకు చేర్చి న్యాయం చేయాలి**

**కళ్యాణదుర్గం సెప్టెంబర్ 19 మనం న్యూస్ :** చీటీ పేరుతో చిల్లర అంగడి హోటల్ యాజమానులు ఉద్యోగులు రాజకీయ నాయకులు చిరు వ్యాపారులు పేద మధ్య ధనిక తేడా లేకుండా ఎవరిని వదలకుండా మొదటిలో బాధితులకు ఆశ చూపి పెద్ద ఉత్తన చీటీ పేరుతో బాధితులకు కుచ్చుటోపి తలపై పెట్టి చేతులెత్తేసిన ఖముద్రిన్ పై బాధితులు శనివారం పట్టణ పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు చేశారు. అనంతరం బాధితులు మాట్లాడుతూ చీటీ పేరుతో మొదటిలో ఆశ చూపి ఒకరి పరిచయం మరొకరి కి అలా నమ్మకంతో కట్టాం మొదటిలో మూడు కోట్లు తేలింది ప్రస్తుతం ఐదు కోట్లు అంటున్నారు. అతని కుటుంబం మొత్తం పరారీలో ఉంది పోలీసులు కేసు నమోదు చేసుకుని మోసపోయిన బాధ్యత కుటుంబాల కు అతని ఆచూకీ తెలియజేసి మా నగదు మాకు చెందేలా చూడాలని ఆవేదనతో తెలిపారు.

# నోటీసులు బేఖాతర్.. అనుమతి లేని కళాశాల యథాతథం!

**– లక్ష్యం' జూనియర్ కళాశాలకు రెండోసారి హెచ్చరిక**
**– విద్యాశాఖ అధికారుల తనిఖీ**

**గోరంట్ల, సెప్టెంబర్ 19 మనం న్యూస్:** ప్రభుత్వ అనుమతి లేకుండా జూనియర్ కళాశాలను నిర్వహిస్తూ, విద్యాశాఖ అధికారులు జారీ చేసిన నోటీసులను సైతం పట్టించుకోకుండా తరగతులు కొనసాగిస్తున్న వ్యవహారంపై అధికారులు సీరియస్‌గా స్పందించారు. గోరంట్ల మండలంలోని గుమ్మయ్యగారిపల్లి సమీపంలో నిర్వహిస్తున్న 'లక్ష్యం' జూనియర్ కళాశాలను శ్రీ సత్యసాయి జిల్లా డీఐఈఓ చెన్నకేశవ ప్రసాద్ తనిఖీ చేశారు. కళాశాలకు ప్రభుత్వ అనుమతి లేదని మరోసారి నిర్ధారించారు. ఇప్పటికే నోటీసు జారీ చేసినప్పటికీ కళాశాల నిర్వహణ కొనసాగుతుండటంతో రెండోసారి హెచ్చరికలు జారీ చేశారు. లక్ష్యం అకాడమీ నిర్వాహకులు ప్రస్తుత విద్యాసంవత్సరంలో నూతనంగా జూనియర్ కళాశాలను ప్రారంభించినట్లు సమాచారం. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఏకంగా 91 మంది విద్యార్థులను చేర్చుకున్నట్లు అధికారులు గుర్తించారు. అయితే కళాశాలకు ప్రభుత్వ అనుమతి లేకపోవడంతో విద్యార్థుల్లో కొంతమందిని ధర్మవరంలోని సాయికృప కళాశాలలో, మరికొంతమందిని హిందూపురంలోని సప్తగిరి కళాశాలలో ప్రవేశాలు కల్పించి, పేర్లు మాత్రం ఆయా కళాశాలల్లో ఉండేలా చేసి గోరంట్లలోని లక్ష్యం కళాశాలలో తరగతులు నిర్వహిస్తున్నట్లు తనిఖీలో వెల్లడైనట్లు అధికారులు తెలిపారు. ఈ వ్యవహారంపై డీఐఈఓ చన్నకేశవ ప్రసాద్ గత ఆగస్టు నెలలోనే లక్ష్యం కళాశాల నిర్వాహకులకు షోకాజ్ నోటీసు జారీ చేశారు. వారం రోజుల్లోగా సంజాయిషీ ఇవ్వాలని, ప్రభుత్వ అనుమతి లేని కళాశాల నిర్వహణను నిలిపివేసి మూసివేయాలని నోటీసులో స్పష్టం చేసినట్లు తెలిపారు. అయితే ఆదేశాలను పట్టించుకోకుండా కళాశాలను యథాతథంగా కొనసాగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. నోటీసులు ఇచ్చినా.. ఆదేశాలు జారీ చేసినా.. కళాశాల నిర్వహణ మాత్రం ఆగలేదు! దీంతో విద్యాశాఖ అధికారులు మరోసారి రంగంలోకి దిగారు. తాజాగా కళాశాలను తనిఖీ చేసి, అనుమతి లేకుండా తరగతులు నిర్వహిస్తున్న విషయాన్ని పరిశీలించారు. విద్యార్థులకు కూడా లక్ష్యం జూనియర్ కళాశాలకు ప్రభుత్వ అనుమతి లేదని స్పష్టంగా తెలియజేశారు. ప్రభుత్వ అనుమతి లేకుండా కళాశాలను నిర్వహించడం నిబంధనలకు విరుద్ధమని డీఐఈఓ స్పష్టం చేశారు. ఇప్పటికే ఒకసారి నోటీసు జారీ చేసినప్పటికీ, దానిని బేఖాతర్ చేసి కళాశాల నిర్వహణ కొనసాగించడం పట్ల అధికారులు తీవ్రంగా స్పందించారు. ఇకపై కూడా అనుమతి లేకుండా తరగతులు నిర్వహిస్తే ఉన్నతాధికారుల దృష్టికి



తీసుకెళ్లి నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇది రెండోసారి హెచ్చరిక చేస్తున్నామని కళాశాల కరస్పాండెంట్‌కు అధికారులు స్పష్టం చేశారు. విద్యాశాఖ జారీ చేసిన ఆదేశాలను ఇకపై ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని తేల్చిచెప్పారు. విద్యార్థులు, తల్లిదండ్రులు కూడా అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. పిల్లలను చేర్పించే ముందు సంబంధిత కళాశాలకు ప్రభుత్వ అనుమతి, గుర్తింపు ఉందా లేదా పరిశీలించాలని తెలిపారు. అనుమతి లేని కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల విద్యా భవిష్యత్తుపై ప్రభావం పడే అవకాశం ఉన్నందున తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని సూచించారు. అనుమతి లేదు.. నోటీసు ఇచ్చారు.. మూసివేయాలని ఆదేశించారు.. అయినా నిర్వహణ కొనసాగింది. దీంతో విద్యాశాఖ అధికారులు రెండోసారి హెచ్చరికలు జారీ చేయడం గోరంట్లలో చర్చనీయాంశంగా మారింది.

# హానికరమైన ఏపీకే ఫైళ్లతో ప్రజలు అప్రమత్తత అవసరం

**– చలానా పేరుతో వచ్చే నకిలీ లింకులపై జాగ్రత్త అవసరం**

**కదిరి, సెప్టెంబర్19మనంన్యూస్:–** ట్రాఫిక్ చలానా, ఆర్‌టీఓ చలానా పేరుతో వచ్చే నకిలీ లింకులు, హానికరమైన ఏపీకే ఫైళ్ల ద్వారా జరుగుతున్న సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని శ్రీ సత్యసాయి జిల్లా లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ పనింద్ర కుమార్ సూచించారు. సైబర్ మోసాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు రూపొందించిన పోస్టర్లను ఆయన శనివారం విడుదల చేశారు.



తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఏపీకే ఫైళ్లను మొబైల్‌లోకి దింపుకొని ఏర్పాటు చేయడం వల్ల వ్యక్తిగత సమాచారం, బ్యాంకు ఖాతా వివరాలు, ఒకసారి మాత్రమే ఉపయోగించే సంకేత సంఖ్యలు తదితర సున్నితమైన సమాచారం మోసగాళ్ల చేతికి వెళ్లే ప్రమాదం ఉందని తెలిపారు. అనుమానాస్పద లింకులపై నొక్కకూడదని, రహస్య సంకేత సంఖ్య, వ్యక్తిగత గుర్తింపు సంఖ్య, కార్డు భద్రతా సంఖ్య, బ్యాంకు ఖాతా వివరాలను ఎవరికీ తెలియజేయకూడదని సూచించారు.
సైబర్ మోసానికి గురైన వారు ఆలస్యం చేయకుండా వెంటనే 1930 సైబర్ నేరాల సహాయవాణికి ఫిర్యాదు చేయాలని తెలిపారు.
అదేవిధంగా గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక భద్రతా పథకాలపై కూడా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రజలు, రైతులు, వీధి వ్యాపారులు, మహిళలు, వృద్ధులకు ఆర్థిక అక్షరాస్యత అవగాహన శిబిరాల ద్వారా సైబర్ భద్రతతో పాటు వివిధ సామాజిక భద్రతా పథకాలపై అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.
ఈ సందర్భంగా ఆర్థిక అక్షరాస్యత సీనియర్ కౌన్సిలర్ వీర మారుతి, నారాయణ, నీరజ మాట్లాడుతూ, అనుమానాస్పద లింకులు లేదా ఏపీకే ఫైళ్లు వచ్చినప్పుడు తొందరపడి తెరవకుండా, వాటి నిజానిజాలను నిర్ధారించుకున్న తర్వాతే చర్యలు తీసుకోవాలని సూచించారు.

# టీడీపీలో చేరిన కటిక సంఘం నాయకలు

**– పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే కందికుంట**

**కదిరి, సెప్టెంబర్ 19మనంన్యూస్ :–** తెలుగుదేశంకూటమి పార్టీల ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై వైసీపీని వీడి కటిక సంఘానికి చెందిన పలువురు సోదరులు కదిరి నియోజకవర్గ శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ సమక్షంలో శనివారం తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ వారికి తెలుగుదేశం పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం కల్పిస్తూ, ప్రజా సమస్యల పరిష్కారం మరియు నియోజకవర్గ అభివృద్ధిలో అందరినీ భాగస్వాములను చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నీలగిరి ఇనాయత్, ఇర్ఫాన్, ఫరూఖ్ తదితరులు పాల్గొన్నారు.



## శిశుగృహంలోని ఇద్దరు బాలుర కోసం..

# సంబంధీకులకు పిలుపు

**–30 రోజుల్లో ఆధారాలతో సంప్రదించాలి.. లేకుంటే చట్ట ప్రకారం దత్తతకు చర్యలు**

**పుట్టపర్తి, సెప్టెంబర్ 19 మనం న్యూస్ :** శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని శిశుగృహంలో సంరక్షణలో ఉన్న ఇద్దరు అనాథ బాలురకు సంబంధించి వారి తల్లిదండ్రులు లేదా రక్తసంబంధీకులు ఎవరైనా ఉంటే తగిన ఆధారాలతో సంప్రదించాలని జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారత అధికారిణి ప్రమీల తెలిపారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. శిశుగృహంలో ప్రస్తుతం సంరక్షణ పొందుతున్న ఇద్దరు బాలురకు సంబంధించి తల్లిదండ్రులు, రక్తసంబంధీకులు లేదా కుటుంబ సభ్యులు ఎవరైనా ఉంటే, బాలలకు సంబంధించిన బంధుత్వాన్ని నిరూపించే తగిన ఆధారాలతో కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. ప్రకటన విడుదల చేసిన సెప్టెంబర్ 19, 2026 నుంచి 30 రోజులలోపు సంబంధిత ఆధారాలతో సంప్రదించాలని స్పష్టం చేశారు. నిర్ణీత గడువులోగా ఎవరూ బాలల కోసం ముందుకు రాకపోతే బాలల న్యాయ చట్టం--2015, దత్తత నియమ నిబంధనలు--2022 ప్రకారం తదుపరి చర్యలు చేపడతామని అధికారులు తెలిపారు. బాలల సంక్షేమ సమితి ద్వారా వారిని అనాథలుగా ప్రకటించి, చట్టబద్ధమైన విధానంలో అర్హులైన దత్తత కోరే తల్లిదండ్రులకు దత్తత ఇచ్చే ప్రక్రియ చేపడతామని పేర్కొన్నారు. శిశుగృహంలో ఉన్న ఇద్దరు బాలురలో ఒకరి వయస్సు మూడు నెలలు కాగా, మరొక బాలుడి వయస్సు ఒక నెల 15 రోజులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. బాలల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సంబంధీకులు ఉంటే నిర్ణీత గడువులోగా తగిన ఆధారాలతో అధికారులను సంప్రదించాలని కోరారు.





# గురుకులంలో చేతివాటం.. సరుకులు పక్కదారి మల్లింపు !

**– విషయం బయటకురాగానే మాటమార్చిన పాఠశాల ప్రిన్సిపాల్**





**నార్పల సెప్టెంబర్ 19 మనం న్యూస్ :** మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థుల కోసం ప్రభుత్వం అందిస్తున్న బియ్యం, నిత్యావసర సరుకుల దారి మల్లింపు వ్యవహారం తీవ్ర ఆరోపణలు వెలుగులోకి రావడం కలకలం రేపుతోంది. ప్రభుత్వ సరుకుల నిర్వహణలో పాఠశాల సిబ్బంది వ్యవహారశైలిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సరుకుల వ్యవహారం బయటపడటంతో అసలు విషయం బయటకు రాకుండా ఆధారాలు మార్చుతున్నారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. తొలుత ఒక రకంగా చెప్పి, విషయం తీవ్రత పెరగడంతో మరో రకంగా సమాధానం ఇస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో పాఠశాలలో ప్రభుత్వ సరుకుల నిర్వహణపై పూర్తిస్థాయిలో విచారణ చేయాల్సిన అవసరం ఉందని తల్లిదండ్రులు, స్థానికులు కోరుతున్నారు. విద్యార్థుల కడుపు నింపాల్సిన ప్రభుత్వ సరుకులు పక్కదారి పట్టాయనే ఆరోపణలు రావడం సాధారణ విషయం కాదని, దీనిపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించి స్టాక్ రిజిస్టర్లు, సరుకుల నిల్వలు, పంపిణీ వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి నిజానిజాలు నిగ్గుతేల్చాలని విద్యార్థుల తల్లితండ్రులు డిమాండ్ చేస్తూనే ఆరోపణలు రుజువైతే బాధ్యులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఘటనపై స్పందించిన నియోజకవర్గ ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ ఈ ఘటనపై తీవ్రంగా స్పందించారు. గురుకుల పాఠశాలలో చోటుచేసుకున్న వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని ఉన్నతాధికారులను ఆదేశించామని ఘటనకు బాధ్యులైన వారిని గుర్తించి, తప్పు చేసినట్లు తేలితే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల కోసం ప్రభుత్వం అందిస్తున్న బియ్యం, నిత్యావసర సరుకులు, ఇతర సదుపాయాలు పూర్తిస్థాయిలో విద్యార్థులకే అందేలా అధికారులు పర్యవేక్షించాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వంలో ఇలాంటి అవకతవకలకు ఎలాంటి తావు లేదని, విద్యార్థుల సంక్షేమం విషయంలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు నాణ్యమైన భోజనం, అవసరమైన సదుపాయాలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వ సరుకుల విషయంలో ఎలాంటి అవకతవకలు చోటుచేసుకున్నా వాటిని పూర్తిస్థాయిలో పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకునేలా అధికారులు వ్యవహరించాలని బండారు శ్రావణి శ్రీ కోరారు.

# ఎస్పీ సతీష్ కుమార్‌కు సామకోటి జన్మదిన శుభాకాంక్షలు

**– ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో సమర్థవంతమైన పోలీసింగ్**



**పుట్టపర్తి, సెప్టెంబర్ 19, మనం న్యూస్:** శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్‌ను రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి సామకోటి ఆదినారాయణ మర్యాదపూర్వకంగా కలిసి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ సతీష్ కుమార్‌కు బాబా చిత్రపటాన్ని అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. జిల్లా ఎస్పీగా పోలీసు శాఖను సమర్థవంతంగా నడిపిస్తూ శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ సమర్థవంతంగా పనిచేస్తున్నారని సామకోటి ఆదినారాయణ పేర్కొన్నారు. జిల్లాలో శాంతిభద్రతల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తూ చోరీలు, గంజాయి వంటి అక్రమ కార్యకలాపాల నియంత్రణతో పాటు మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ పోలీసు యంత్రాంగాన్ని అప్రమత్తంగా ఉంచుతున్నారని తెలిపారు. ప్రజలకు భద్రతా భావన కల్పించేందుకు క్షేత్రస్థాయిలో పోలీసింగ్‌ను బలోపేతం చేస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండేలా పోలీసు వ్యవస్థను ముందుకు తీసుకెళ్తున్న ఎస్పీ సతీష్ కుమార్ సేవలను సామకోటి ఆదినారాయణ అభినందించారు. ప్రజలకు సేవ చేయడంలో ఎస్పీకి ఉన్న అంకితభావం, నిజాయితీ, క్రమశిక్షణ మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. ఎస్పీ సతీష్ కుమార్ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు వర్ధిల్లాలని సామకోటి ఆదినారాయణ హృదయపూర్వకంగా కోరుకున్నారు.

# విద్యుత్ తీగలు తగిలి గడ్డి ట్రాక్టర్ దగ్ధం

**– రూ.11,000 ఆర్థిక నష్టం, –తృటిలో తప్పిన పెను ప్రమాదం**




**కుందుర్పి, సెప్టెంబర్ 19 (మనం న్యూస్):** కుందుర్పిలో శనివారం మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో పెను ప్రమాదం తృటిలో తప్పిన ఘటన చోటు చేసుకుంది. ఈక్రమమలోనే స్థానిక బెంగళూరు బేకరీ క్రాస్ వద్ద కణేకల్లు నుంచి రోడ్డు పై యన్,వెంకటంపల్లి గ్రామానికి ఎండిన మొక్కజొన్న గడ్డిని తరలిస్తున్న ట్రాక్టర్‌కు డ్యామేజ్ అయిన విద్యుత్ తీగలు తగిలాయి. దీంతో ట్రాక్టర్ పై అధికంగా పేర్చిన గడ్డికి ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. మంటలను గమనించిన స్థానికులు డ్రైవర్‌ను ఆపమని కేకలు వేసినా, అక్కడే ఆపితే బేకరీ వద్ద పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉండటంతో డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి వాహనాన్ని వేగంగా ఆర్డీటీ దేవాలయం వద్దకు తీసుకెళ్లాడు. అక్కడ ట్రాలీ నుంచి ఇంజన్‌ను వేరు చేయడంతో ట్రాక్టర్ ప్రమాదం నుంచి బయటపడింది.దింతో సమాచారం అందుకున్న గ్రామస్తులు ఆర్డీటీ కళ్యాణ మండపంలోని నీటితో యుద్ధ ప్రాతిపదికన మంటలను ఆర్పేందుకు నీటి పైపుతో ప్రయత్నించినా, గడ్డి అంతా కాలి బూడిదైంది. చివరకు జేసీబీ సహాయంతో గడ్డిని తొలగించి మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనలో సుమారు రూ.11, 000 విలువైన పశుగ్రాసం అగ్నికి ఆహుతి అయింది. కరువు కాలంలో పశువులకు మేత కూడా దొరకని పరిస్థితిలో గడ్డి ఇలా కాలిపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదానికి ప్రధాన కారణం డ్యామేజ్ అయిన విద్యుత్ తీగలేనని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనను తిలకించడానికి ప్రజలు తండోపతండాలుగా తరలివచ్చారు. గ్రామంలో పలుచోట్ల వేలాడుతున్న, తెగిపోయిన విద్యుత్ వైర్లను వెంటనే మార్చాలని, లేకుంటే భారీ ప్రాణ, ఆస్తి నష్టం జరిగే ప్రమాదం ఉందని ప్రజలు విద్యుత్ శాఖ అధికారులను కోరుతున్నారు.

# వినియోగదారులుకు రేషను సరుకులు అందకపోతే సహించం

**–తహశీల్దార్ అధికారికి సిపిఐ నాయకులు వినతి.**

**– వినియోగదారులుకు న్యాయం చేయాలని విజ్ఞప్తి**



**కుందుర్పి సెప్టెంబర్ 19 మనం న్యూస్ :** ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసే రేషన్ సరుకులును డీలర్ దుకాణాల ద్వారా అందకపోతే సహించమని తాసిల్దార్ ,డి,ఓబులేష్ హెచ్చరించారు. శనివారం మండల పరిధిలోని మాయదార్లపల్లిలో డిలరు తమకు ఆగస్టు నెలలో కొంత మందికి తంబు వేయించుకొని రేషను సరుకులును రేపు నెలలో ఇస్తానని చెప్పి ఇవ్వలేదని ,తమకు తిరిగి ఇప్పించేలా న్యాయం చేయాలని కోరుతూ తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ ఓబళేషు అధికారికి ఆ గ్రామ సిపిఐ నాయకులు ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని సమర్పించారు. మా గ్రామంలో కొంతమంది తంబు వేయించుకొని రేషను సరుకులును ఇవ్వలేదని వారు ఆరోపించారు. నమ్మించి ఇవ్వక పోవడం మెసం చేయడమేనని అన్నారు. తమకు రేషను సరుకులును తిరిగి డిలరుచే ఇప్పించాలని తహశీల్దార్ ను విజ్ఞప్తి చేశారు.తమకు న్యాయం చేయాక పోతే డియస్ఓ అధికారికి ఫిర్యాదు చేస్తాంమని ఫిర్యాదులో వారు పేర్కొన్నారు.తహశీల్దారు అధికారి మాట్లాడుతూ.మి ఫిర్యాదు పైన పౌరసరఫరాల శాఖ అధికారి రాజశేఖర్ వినియోగదారులును రెండు రోజుల లోగా విచారణ చేస్తారని తెలిపారు.ఈ విచారణలో వాస్తవమని తెలితే క్రిమినల్ చర్యలుకు పై అధికారులు తీసుకుంటారని , సిఫార్సు చేస్తామని చెప్పారు.మిరు పి,యస్ లో ఫిర్యాదు చేయమని సిపిఐ నాయకులుకు సూచించారు. మికు విచారించి న్యాయం చేస్తామని ఆయన చెపగా వారు వెనుదిరిగారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు ,శ్యామియల్, ఉమేష్ , నరసింహులు తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

# హజరత్ పీర్ భక్తర్ వలి దర్గా దారికి విద్యుత్ వెలుగులు

**– ఎమ్మెల్యే బాలకృష్ణ చొరవతో విద్యుత్ స్తంభాల ఏర్పాటు**

**– సొంత నిధులతో దీపాలు ఏర్పాటు చేస్తానన్న తెలుగు యువత అధ్యక్షుడు మంజునాథ్**



**హిందూపురం (మనం న్యూస్) సెప్టెంబర్ 19.** లేపాక్షి మండలం మలిరెడ్డిపల్లి ప్రధాన రహదారి నుంచి హజరత్ పీర్ భక్తర్ వలి దర్గా వరకు రాత్రివేళల్లో నెలకొన్న చీకటి సమస్యకు పరిష్కారం లభిస్తోంది. దర్గా కమిటీ నిర్వాహకులు సమస్యను హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించి విద్యుత్ సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని తన వ్యక్తిగత కార్యదర్శులు వీరయ్య, బాలాజీలను ఆదేశించారు. ఎమ్మెల్యే సూచనల మేరకు విద్యుత్ శాఖ అధికారులు శనివారం విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులను ప్రారంభించారు. విద్యుత్ శాఖ నిర్మాణ విభాగం ఇంజినీర్ షేక్ అబ్దుల్ రహీం మాట్లాడుతూ ఆర్డీఎస్ పథకంలో భాగంగా మలిరెడ్డిపల్లి నుంచి దర్గా వరకు సుమారు 20 విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పనులను త్వరితగతిన పూర్తి చేసి విద్యుత్ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు చేపడుతున్నామని వివరించారు.

**సొంత నిధులతో దీపాల ఏర్పాటు**

విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులను పూలకుంట మాజీ సర్పంచ్, హిందూపురం అసెంబ్లీ తెలుగు యువత అధ్యక్షుడు పూలకుంట మంజునాథ్ పరిశీలించారు. దర్గా మార్గంలో భక్తుల సౌకర్యార్థం అవసరమైన విద్యుత్ దీపాలను తన సొంత నిధులతో ఏర్పాటు చేస్తానని ప్రకటించారు. ఉరుసు ఉత్సవాల సందర్భంగా రాత్రివేళల్లో పెద్ద సంఖ్యలో భక్తులు దర్గాకు రాకపోకలు సాగించే నేపథ్యంలో మార్గమంతా వెలుగులు ఏర్పాటు చేయడం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.

**ఎమ్మెల్యేకు దర్గా కమిటీ కృతజ్ఞతలు**

దర్గా మార్గంలో విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు వెంటనే స్పందించిన ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు దర్గా కమిటీ అధ్యక్షులు మక్తియార్, మహమ్మద్ షరీఫ్, మహబూబ్ దౌలా కృతజ్ఞతలు తెలిపారు. సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లిన వెంటనే అధికారులను ఆదేశించి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. భక్తుల సౌకర్యార్థం సొంత నిధులతో దీపాలు ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చిన మంజునాథ్‌కు వారు ధన్యవాదాలు తెలిపారు.

# ఘనంగా శ్రీ విద్యా గణపతి నిమజ్జనం



**హిందూపురం (మనం న్యూస్) సెప్టెంబర్ 19.** హిందూపురం మున్సిపాలిటీ పరిధిలోని 28వ వార్డు ఎస్.సడ్లపల్లి గ్రామంలో శ్రీ విద్యా గణపతి ఉత్సవాలు ఐదు రోజుల పాటు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. కమ్యూనిటీ హాలులో ప్రతిష్ఠించిన శ్రీ విద్యా గణపతికి ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, కార్యక్రమాలు నిర్వహించారు.

ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన వేలంపాటలో స్వామివారి లడ్డూ ప్రసాదం, వెండి ప్రతిమను అదే గ్రామానికి చెందిన పెద్ది రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి రూ.25 వేలతో దక్కించుకున్నారు.అనంతరం శనివారం శ్రీ విద్యా గణపతి నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా గణపతి విగ్రహాన్ని భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. ఈ సందర్భంగా యువత, మహిళలు ఉత్సాహంగా పాల్గొని కేరింతలతో సందడి చేశారు. అనంతరం ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా ముగించారు.

# నల్లచెరువులో గుంతల రోడ్డుకు మరమ్మతులు

**నల్లచెరువు, సెప్టెంబరు 19 మనం న్యూస్:** మండల కేంద్రంలోని గుంతలతో అధ్వానంగా మారిన రహదారికి మరమ్మతు పనులు ప్రారంభమయ్యాయి. రహదారి దెబ్బతినడంతో ప్రజలు, వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికారులు మరమ్మతు పనులు చేపట్టారు. మండల ప్రత్యేక అధికారి అశోక్‌కుమార్, మాజీ ఉపసర్పంచ్ కుమారుడు షరీఫ్ మరమ్మతు పనులను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు.ఈ సందర్భంగ వారు మాట్లాడుతూ కదిరి శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ ఆదేశాల మేరకు రహదారిపై ఏర్పడిన గుంతలను యంత్రాల సహాయంతో సరిచేస్తూ, పనులు సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకున్నామన్నారు.రహదారి మరమ్మతులు పూర్తయితే వాహనదారులు,స్థానిక ప్రజలకు ఇబ్బందులు తొలగుతాయన్నారు.



# గోరంట్లలో కుక్కల స్వైర విహారం.. అధికారుల నిర్లక్ష్యమేనా?

**–పత్రికల్లో ఎన్నిసార్లు ప్రచురించినా ప్రయోజనం శూన్యం..**
**–విద్యాసంస్థల వద్దే గుంపులుగా సంచారం.. భయాందోళనలో విద్యార్థులు, ప్రజలు**





**గోరంట్ల, సెప్టెంబర్ 19, మనం న్యూస్:** ఒకవైపు సుప్రీంకోర్టు ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ వీధి కుక్కల నియంత్రణపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తుంటే.. మరోవైపు గోరంట్ల పట్టణంలో మాత్రం వీధి కుక్కలు గుంపులుగా రోడ్లపై స్వైర విహారం చేస్తున్నాయి. ముఖ్యంగా విద్యాసంస్థలు, ప్రధాన రహదారులు, నివాస ప్రాంతాల వద్ద కుక్కల గుంపులు సంచరిస్తుండటంతో చిన్నారులు, విద్యార్థులు, మహిళలు, వృద్ధులు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. గోరంట్ల పట్టణంలోని ఎస్‌పీవీఎం కళాశాల, శ్రీచైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాల ప్రధాన రహదారి వద్ద వీధి కుక్కల సంచారం స్థానికులను ఆందోళనకు గురిచేస్తోంది. ఉదయం వేళల్లో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉపాధ్యాయులు, చిన్నారులు ఈ రహదారి మీదుగా ప్రయాణించాల్సి ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనన్న భయం నెలకొంది. కుక్కలు గుంపులుగా రోడ్లపైకి వచ్చి వాహనదారులను వెంబడించడం, వాహనాలకు అడ్డంగా పరుగులు తీయడం, ఒక్కసారిగా రోడ్డుపైకి రావడంతో ప్రమాదాల ముప్పు పెరుగుతోందని స్థానికులు చెబుతున్నారు. రాత్రి వేళల్లో పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంటోందని పేర్కొంటున్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం విద్యాసంస్థలు, ఆసుపత్రులు, క్రీడా ప్రాంగణాలు, బస్‌స్టాండ్లు, రైల్వే స్టేషన్లు వంటి ప్రదేశాల్లో వీధి కుక్కల ప్రవేశాన్ని నియంత్రించేందుకు స్థానిక సంస్థలు చర్యలు చేపట్టాల్సి ఉంది. ఆయా ప్రదేశాల్లో కనిపించే వీధి కుక్కలను సంబంధిత అధికారులు తొలగించి, నిబంధనల ప్రకారం టీకాలు, సంతానోత్పత్తి నియంత్రణ అనంతరం నిర్దేశిత ఆశ్రయ కేంద్రాలకు తరలించాలి. అక్కడి నుంచి అదే ప్రదేశానికి తిరిగి వదలకూడదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అయితే గోరంట్లలో మాత్రం పరిస్థితి ఇందుకు భిన్నంగా కనిపిస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీధి కుక్కల సమస్యపై పత్రికల్లో పలుమార్లు కథనాలు ప్రచురించినా, సామాజిక మాధ్యమాల ద్వారా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్యకు శాశ్వత పరిష్కారం కనిపించడం లేదని స్థానికులు అంటున్నారు. ఇటీవల గోరంట్ల మండల పరిధిలో గొర్రెల మందపై వీధి కుక్కలు దాడి చేసి పలు గొర్రెలు మృతి చెందిన ఘటన కూడా చోటుచేసుకుంది. దీంతో పట్టణంలోనూ వీధి కుక్కల బెడద మరింత పెరిగితే ఇలాంటి ఘటనలు ప్రజలపైనా, పశువులపైనా చోటుచేసుకునే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. "ఏదైనా ప్రమాదం జరిగిన తర్వాతే అధికారులు స్పందిస్తారా?" అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. చిన్నారులు, విద్యార్థులు ప్రతిరోజూ రాకపోకలు సాగించే విద్యాసంస్థల పరిసరాల్లోనే కుక్కల గుంపులు సంచరిస్తున్నా పట్టించుకోకపోవడం ఏమిటని నిలదీస్తున్నారు. వీధి కుక్కల నియంత్రణతో పాటు పట్టణంలోని చెత్తాచెదారం, ఆహార వ్యర్థాల నిర్వహణపై కూడా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. కుక్కల సంచారానికి కారణమవుతున్న ప్రాంతాలను గుర్తించి, పారిశుధ్య చర్యలు చేపట్టడంతో పాటు సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో సంబంధిత పంచాయతీ అధికారులు ఇకనైనా స్పందించి, ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని విద్యాసంస్థలు, ప్రధాన రహదారులు, రద్దీ ప్రాంతాల్లో వీధి కుక్కల బెడదను నియంత్రించాలని స్థానికులు కోరుతున్నారు. పత్రికల్లో ఎన్నోసార్లు ప్రచురించినా ప్రయోజనం లేకపోయింది.. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి. ప్రజలు భయపడుతున్న విషయం గుర్తించి తక్షణ చర్యలు చేపట్టాలని గోరంట్ల ప్రజలు కోరుతున్నారు.

# మాట ఇస్తే తప్పదు... అంతే..

**– మంత్రి సవితమ్మ మాటతో నెరవేరిన పల్లె బాట..!!**
**–ఎన్నో ఏళ్ల నాటి పల్లె ప్రజల కోరికకు మోక్షం...గత ఎన్నికల హామీని నిలబెట్టుకున్న మంత్రి సవిత**
**–పెరుమాళ్లపల్లికి రూ.1.20 కోట్లతో తారురోడ్డు...టీడీపీ మండల కన్వీనర్ బాలకృష్ణ చౌదరి చేతుల మీదుగా భూమిపూజ**





**గోరంట్ల, సెప్టెంబర్ 19, మనం న్యూస్:** మా పల్లెకు రోడ్డు ఎప్పుడు వేస్తారు? అంటూ ఏళ్ల తరబడి ఎదురుచూసిన పెరుమాళ్లపల్లి ప్రజల నిరీక్షణకు తెరపడింది. ఎన్నికల ప్రచారంలో గ్రామ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు మంత్రి సవిత నిధులు మంజూరు చేయించి, పెరుమాళ్లపల్లికి తారురోడ్డు నిర్మాణానికి అడుగులు వేయడంతో గ్రామంలో ఆనందం వ్యక్తమవుతోంది. మాట ఇచ్చిన చోటే కాదు.. మాట నిలబెట్టుకున్న చోట కూడా సవితమ్మ పేరు వినిపించేలా హామీ అమలుకు శ్రీకారం చుట్టారని గ్రామస్తులు పేర్కొన్నారు. మారుమూల పల్లె అయినప్పటికీ ప్రజాప్రతినిధులుగా అసెంబ్లీ నుంచి పార్లమెంటు వరకు ప్రాతినిధ్యం వహించిన వారిని అందించిన ఘనత ఆ గ్రామానికి ఉందని స్థానికులు చెబుతున్నారు. అయినప్పటికీ ఇన్నేళ్లుగా గ్రామానికి సరైన తారురోడ్డు లేక ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితిని గత ఎన్నికల ప్రచారంలో టీడీపీ అభ్యర్థిగా వచ్చిన సవిత దృష్టికి తీసుకెళ్లారు. మీ గ్రామానికి తారురోడ్డు వేయించి.. రోడ్డు మీదుగా మీ ఊరికి వస్తాను అని ఆమె ఇచ్చిన హామీ ఇప్పుడు కార్యరూపం దాల్చింది.గోరంట్ల మండలంలోని వెంకటరమణపల్లి పంచాయతీ పరిధిలోని పెరుమాళ్లపల్లి గ్రామానికి రూ.1 కోటి 20 లక్షల వ్యయంతో తారురోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. ఈ పనులకు శుక్రవారం టీడీపీ మండల కన్వీనర్ బాలకృష్ణ చౌదరి చేతుల మీదుగా భూమిపూజ నిర్వహించి పనులను ప్రారంభించారు.ఎన్నో ఏళ్లుగా రోడ్డు కోసం ఎదురుచూస్తున్న తమ గ్రామానికి ఇప్పుడు రహదారి సౌకర్యం కల్పిస్తుండటంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని గుర్తుపెట్టుకుని నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభించిన మంత్రి సవితకు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.ఈ భూమిపూజ కార్యక్రమంలో హస్తకళల స్టేట్ డైరెక్టర్ సోమశేఖర్, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు సుధాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి సురేష్, నిమ్మల శ్రీధర్, సింగిల్ విండో అధ్యక్షులు చంద్ర, రవిమోహన్, పాయల రమణ, మాజీ ఎంపీపీ నిమ్మల విద్యాధరణి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ తిరుపాల్, బీజేపీ మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ బొట్టు శ్రీనివాసులు, జనసేన మండల అధ్యక్షుడు సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.అలాగే స్థానిక నాయకులు మరెడ్డిపల్లి నరసింహులు, పెరుమాళ్లపల్లి శంకరప్ప, జనార్దన్ రెడ్డి, బీసీ సెల్ మండల అధ్యక్షుడు వెంకటరమణ యాదవ్, టైలర్ శ్రీనివాసులు, చంద్రారెడ్డి, గిరిధర్ గౌడ్, అజంతుల్లా, జయరాం, రోహిత్, సుభహన్, ప్రకాష్ చౌదరి, హనుమంత్ రెడ్డి, సోమశేఖర్, సింహాద్రి, మద్దిలేటి, మార్కెట్ యార్డు డైరెక్టర్ హోటల్ చాంద్ భాష తదితరులు పాల్గొన్నారు.